www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 56 శనివారం, జూలై 11, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad








- 2029లో సాధారణ ఎన్నికలు
- ఫామ్ హౌస్‌లో పాపాల భైరవుడు బంధీ
- అసెంబ్లీ స్థానాలు 182, పార్లమెంట్ స్థానాలు 26కు పెంపు
- 117 అసెంబ్లీ, 20 పార్లమెంట్ స్థానాల్లో గెలుస్తాం
- బ్యాండుమేళం బ్యాచ్‌లా బీఆర్ఎస్ సర్వేలు
- మేడిగడ్డ కుంగితే ఖమ్మంలో 44 గ్రామాలు మునిగాయి
- రాజకీయాల కోసం కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలంటున్నారు
- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# మళ్లీ మేమే..

**ఖమ్మం,జూలై 10 :** "వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ సాధారణ ఎన్నికలు 2028 డిసెంబరులో జరగవు. 2029 మే లేదా జూన్ మాసంలో జరుగుతాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26 కు పెరుగుతాయి. 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి. 36 నెలల ముందుగానే వచ్చే ఎన్నికల ఫలితాల జోస్యం చెబుతున్నా...182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వస్తుంది" అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భద్రాచలం రాములవారి మీద ఆన...ఈ మాట కోసం కాంగ్రెస్ కార్యకర్తలు రోజుకు 18 గంటలు పని చేస్తారు అని చెప్పారు. శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగిన 'రైతు ఆశీర్వాద సభ'లో ఆయన మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమా ర్క, శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంక టరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, రామసాయం రఘు రాంరెడ్డి, బలరాంనాయక్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మెన్లు ఈ సభలో పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి సీఎం రేవంత్‌రెడ్డి 1.44 లక్ష?ల మంది రైతుల ఖాతాల్లో రూ.1009.15 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేశారు.అలాగే రైతులకు ఇ-పట్టాదార్ పాస్ పుస్తకాలను

మిగతా2లో...

## గతంలో రైతుబంధు కోసం
# తిప్పించుకున్నారు

- రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలు
- పండించిన ప్రతి గింజను కొంటున్నాం
- రైతు ఆశీర్వాద సభలో డిప్యూటి సిఎం భట్టి



**ఖమ్మం,జూలై 10 :** తెలంగాణలోని రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రైతు భరోసా పథకం కింద నూతనంగా రూ. 1,009 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయగా, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వం రైతు బంధు నిధుల కోసం 169 రోజులు తిప్పించుకునేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే

మిగతా2లో...

## నీటిపారుదల మంత్రిగా హరీష్
# చేసిందేమిటి?

- హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ పిసిసి చీఫ్
- కాంగ్రెస్‌లోకి వస్తామంటే ఆలోచిస్తామని వెల్లడి
- బిఆర్ఎస్ నిధులపై కవిత వ్యాఖ్యల్లో నిజముందని వెల్లడి



**హైదరాబాద్,జూలై 10 :** మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

మిగతా2లో...

# ఆయిల్ పామ్ సాగుతో కోతుల బెడద ఉండదు

- ప్రతి గ్రామంలో కనీసం వంద ఎకరాల్లో సాగు చేయాలి
- రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన




**సిద్దిపేట,జూలై 10 :** ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు.నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం

మిగతా2లో...

## కాళేశ్వరంపై కాంగ్రెస్, బిఆర్ఎస్
# డ్రామాలు

- ప్రాజెక్ట్ పునరుద్దరణపై కావాలనే జాప్యం
- నాకు పార్టీకన్నా తెలంగాణ ముఖ్యమన్న ఎంపి ఈటెల



2లో

## టిఆర్ఎస్‌ను గెలిపిస్తే..అక్క రాజ్యం
# చూపిస్తా...

- తమ ప్రభుత్వంలో రైతుకు కుర్చీ వేసి గౌరవిస్తాం
- మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తాం
- గిరిజనుల సమస్యలై ఢిల్లీ దాకా కొట్లాడుతాం
- పాంచజన్యంతో ముందుకు వెళతామన్న కవితక్క



**భద్రాద్రి కొత్తగూడెం,జూలై 10 :** ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తానని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను

మిగతా2లో...

# కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

- హరీష్ రావు అసమర్థుడని ఆనాడే గుర్తించిన కెసిఆర్
- హుజూర్ నగర్‌లో మోడల్ కాలనీకి మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన



**నల్లగొండ,జూలై 10 :** కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడానికి ప్రధాన కారణం కేవలం బీఆర్ఎస్ పార్టీయేనని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎక్కువ మొత్తం ఖర్చు పెడితే.. ఎక్కువ కమిషన్ వస్తుందనే దురాశతోనే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును తొలగించి కాళేశ్వరం అని పేరు మార్చారని ఆరోపించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ మంత్రిగా

మిగతా2లో...



# మళ్లీ మేమే..

(మొదటి పేజీ తరువాయి)

అందచేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 2023 లో ప్రభుత్వ ఏర్పాటు నుంచి ప్రతి ఎన్నికల్లో ప్రజా ప్రభు త్వాన్ని గెలిపించి, పాపాల భైరవుడిని ఫామ్ హౌస్ లోనే బందీ చేశారని చెప్పారు. జరగబోయే కురుక్షే త్రంలో కౌరవ కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీ య ముఖచిత్రం నుంచి పాతా ళానికి తొక్కే వరకు కాంగ్రెస్ కార్యకర్తలు విశ్రమిం చరని అన్నారు. రాజకీయంగా పాలమూరు తనకు ప్రాణమైతే, ఖమ్మం జిల్లా గుండె లాంటిదన్నారు. బీఆర్ఎస్ అధినేత కే చంద్ర శేఖర్ రావు (కేసీఆర్) దొంగ సర్వేలు చేయించుకొని, ఆత్మతృప్తి పొందుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ దొంగ సర్వేలు చేసే దొంగ ఏజెన్సీలు ఒక్క విషయం గుర్తు పెట్టుకోలంటూ ఎన్నికలు 2029లో జరుగుతాయని తెలిపారు. కేసీఆర్ కుటుంబంలో ఒకరిపై ఒకరికి నమ్మకం లేదనీ, ఒకే ఇంట్లో రెండు గుంపులు ఉన్నాయని ఎద్దేవా చేశా రు. "ఒకాయన కన్నె పల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడు. ఒకసారి మేడిగడ్డ కుంగితేనే ఖమ్మం జిల్లాలో 44 ఊర్లు కొట్టుకుపోయాయి. మళ్లీ నీళ్లు నింపితే భద్రాచలం రాముడు మునుగుతాడు" అని హెచ్చ రించారు. మీ దుష్ట రాజకీయాల కోసం మేడిగడ్డ నింపాలా ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి చేసుకున్న సర్వేలో కాంగ్రెస్ ఓడిపో తుందనే దుష్ప్రచారానికి దిగారనీ, ఎన్నికలు ఎప్పుడో, రిజర్వేషన్లు ఎలా మారుతాయో తెలియకుం డా ఎవరైనా సర్వేలు చేస్తారా.. గెలుపు ఓటములు నిర్ణయిస్తారా? అని అడిగారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో ఇలాగే చెబితే జనం బీఆర్ఎస్‌ను బండకేసి కొట్టారన్నారు. బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైందని ఎద్దేవా చేశారు. బీజేపీ లోకి వెళ్ళనని హరీశ్ రావు కేసీఆర్ పై ఒట్టేసి చెప్పాల న్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారనీ, ఆంధ్రా కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు వందల కోట్లు ఇచ్చారని కేసీఆర్ సొంత కూతురు, కేటీఆర్ సొంత చెల్లెలే చెబు తున్నదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అమలు చేసిన షాది ముబారక్, రైతు బందు పథకాలను తాము కొనసాగి స్తున్నామని చెప్పారు. ప్రతి పేదవాడికి రేషన్ కార్డు, సన్న బియ్యం, 200 యూ నిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని గుర్తుచేశారు. రైతు భరోసాను రూ. 12 వేలకు పెంచి, రైతు రుణమాఫీ అమలు చేశామని వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ నుంచి 26 పార్లమెంట్ స్థానాలకు 20 పార్లమెంట్ స్థానాలు గెలిపించి, రాహుల్ గాంధీని ప్రధాని చేసుకుందామని పిలుపునిచ్చారు. అలాగే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి కోరినట్టు మధిరకు

# నీటిపారుదల మంత్రిగా హరీష్ చేసిందేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆ తరవాత ఆలోచిస్తామని అన్నారు. శుక్రవారం గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు.హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారు? ఆయన జలవనరులశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన ప్రాజెక్టే కుంగింది.. దాని గురించి ఏం చెప్పాలి. పదేళ్లు మంత్రిగా ఉంటూ ఏం చేశారు?.. మళ్లీ మూడు నెలలు ఎందుకు? బీఆర్ఎస్ పార్టీ నిధులపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణల్లో నిజముంది. ఒక ప్రాంతీయ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా వచ్చాయి? హరీశ్‌రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.' అని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తుంగతుర్తిలో నేతల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు సీనియర్లను పరిశీలకులుగా నియమించామని చెప్పారు. వరంగల్ అంశాన్ని సచిన్ సావంత్‌కు, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించాం. అందరితో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.

# టీఆర్ఎస్‌ను గెలిపిస్తే..అక్కరాజ్యం చూపిస్తా...

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

నువ్వు పనికిరావని మీ మామే నిన్ను పదవి నుంచి తీసివేసి సర్టిఫికెట్ ఇచ్చాడు కదా' అంటూ ఎద్దేవా చేశారు. రూ. 38 కోట్లతో తమ్మిడిహెట్టి ప్రాజెక్టు చేపట్టి కనీసం పూర్తి చేయలేక పోయారని మండిపడ్డారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రూ. 20 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన.. బీఆర్ఎస్ నేతలపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కవిత ఆన్ రికార్డ్‌గా చెప్పిన 1400 కోట్ల కమిషన్ వ్యవహారాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

కనీసం మట్టి పరీక్షలు కూడా నిర్వహించకుండా, అధికారులు సూచించిన చోట కాకుండా ఐదు కిలోమీటర్ల దూరంలో, ఇసుకపై పునాది వేయడం వల్లే ప్రాజెక్టు కూలిపోతుందని సేఫ్టీ కంట్రోల్ ముందే హెచ్చరించినా బీఆర్ఎస్ వినలేదని ఉత్తమ్ మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ టీమ్ హెచ్చరించినా పట్టించుకోకుండా.. ఇప్పుడు కాంగ్రెస్‌పై నిందలు వేయడం సరికాదన్నారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు నీటిని నిల్వ చేయొద్దని చెబుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఇంకా మోసపూరిత మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటకు వస్తున్న నీళ్లు ఎస్సారెస్పీ స్టేజ్-2 ద్వారా వస్తున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కసారి కూడా కాళేశ్వరం నీళ్లు వదల్లేదని స్పష్టం చేశారు. తెలంగాణను అప్పులమయం చేసిన బీఆర్ఎస్ తప్పులను సరిదిద్దుతూ.. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# సకలం చెరువు శిఖిలో ఫాతిమా కాలేజీ

**హైడ్రా ఎందుకు అక్కడికి వెళ్లడం లేదు**

**ఎంఐఎంకు కాంగ్రెస్ ఎందుకు కొమ్ము కాస్తోంది**

**ఎక్స్ వేదికగా బండి సంజయ్ విమర్శలు**

**హైదరాబాద్,జూలై 10 :** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. ఇది ప్రపంచమంతా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చూడనట్లు నటిస్తోందని ఆయన మండిపడ్డారు. కళ్లున్నా చూడనట్లు నటిస్తూ ఎంఐఎం తొత్తుగా ప్రభుత్వం వ్యవహరిస్తోదని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అందరికీ కనిపిస్తున్న ఈ ఆక్రమణను మాత్రం ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నిం చారు. ఈ మేరకు ఎక్స్



వేదికగా బండి సంజయ్ పోస్టు పెట్టారు. కాంగ్రెస్ నాయకులకు వెంటనే కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతల కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా వారికి చెరువు పక్కన కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో కాదు.. వారి రాజకీయాల్లోనే ఉందని అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోం దన్నారు. కాంగ్రెస్ ఎక్కడ రాజకీయ రంగోలి వేయాలనుకుంటే అక్కడ ఫుల్ ట్యాంక్ లెవల్ గీతలు వారి మిత్రులకు అనుకూ లంగా మారిపోతున్నా యంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ తనకు అనుకూల ంగా వ్యవస్థలను వినియోగిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాగా, సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒవైసీ కాలేజీ ఉందనే అంశంపై ఇటీవల రాజకీయంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఎక్స్ వేదికగా బండి సంజయ్ చేసిన పోస్టు.. తెలంగాణ రాజకీ యాల్లో మరోసారి దుమారం రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# గతంలో రైతుబంధు కోసం తిప్పించుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

రూ. 9 వేల కోట్లు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం రూ. 8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామన్నారు. అలాగే మహిళా సంక్షేమానికి కట్టుబడి కేవలం రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలను అందించామని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ రైతును రాజుగా చూస్తున్నామని భట్టి స్పష్టం చేశారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు రూ. 27,000 కోట్లతో అయిపోయే ప్రాజెక్టును రూ. 1,47,000 కోట్లకు పెంచి, కట్టక కట్టక కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీష్ రావు అబద్ధాలన్నీ ప్రోగేసి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు అయిపోయిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# ఆయిల్ పామ్ సాగుతో కోతుల బెడద ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్, బిఆర్ఎస్ డ్రామాలు

**హైదరాబాద్,జూలై 10 :** కాళేశ్వరం విషయంలో డ్రామాలు ఆడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్‌పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణకు నీళ్ల జంక్షన్ మిడ్ మానేరు అని తెలిపారు. కరువు వస్తుందని తెలిసీ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. లోలెవల్ పాయింట్‌కు వచ్చే నీటిని ఎందు కు ఎత్తిపోయడం లేదని ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'నేను తెలంగాణ మట్టిబిడ్డను.. ఉద్యమకారున్ని.. అదే నా గుర్తింపు. నాకు తెలంగాణ ఫస్ట్.. తర్వాతే పార్టీ.. వ్యక్తిగతం. రాజకీయాల కోసం తెలంగాణ ప్రజలకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోను. చీల్చి చెండాడుతా. నేను ఒకరు ఆడించినట్టు ఆడే వ్యక్తిని కాదు. మేము స్వయం ప్రకాశితులం. ఎవరో మాట్లాడిస్తేనో.. స్క్రిప్ట్ రాసి ఇస్తేనో.. ఎవరి మెప్పుకోసమో మాట్లాడేవాళ్లం కాదు. అలా ఆరోపించే నీచులకు నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. నేను కాంగ్రెస్ పార్టీని, ఇంకో పార్టీని తిట్టడానికి రాలేదు. పని చేయాల్సిన వారిని అడుగుతున్నా. దేవాదులకు బెరాజ్ లేదు.. లేకుండానే నీళ్ల పంపు చేస్తున్నారు. మేడిగడ్డలో నీళ్లు నింపమని అడగడం లేదు.. ఉన్న నీళ్లను పంప్ చేయమని అడుగుతున్నా. రాజకీయాలు చేసి రైతులను ఇబ్బంది పడితే ఖబర్దార్. హైదరాబాద్‌కి ఇప్పుడే 107 ఓఉఆ నీళ్ల సరఫరా తక్కువ ఉంది. నీటి కొరత వస్తే ఎటు పోవాలి' అని ఈటల పేర్కొన్నారు.

# రెండుచోట్ల ఓటు ఉంటే ఏడాది జైలు..

(మొదటి పేజీ తరువాయి)

చేస్తామని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతోపాటు రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ పురోగతిని వెల్లడించారు.తెలంగాణవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ ప్రశాంతంగా సాగుతున్నదని, సేకరించిన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఎన్యుమరేషన్ ఫారాలు అందని వారు, ఓటు ఉండి ఫారం రాని వారు వెంటనే తమ పరిధిలోని బీఎల్‌వోను సంప్రదించాలని సూచించారు. అర్హులు అందరూ ఎన్యుమరేషన్ ఫారం నింపి ఇవ్వాల్సిందేనని, లేనిపక్షం లో ఓటరు జాబితాలో పేరు రాదని స్పష్టంచేశారు. ఒకవేళ ఇప్పుడు ఫారాలు రాకపో తే, ఆగస్టులో ఫారం-6, ఫారం-8 ఇస్తారని, వాటిని నింపి ఇవ్వవచ్చని పేరొన్నారు. 'సర్' ప్రక్రియ ముగిసిన తర్వాత కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం ఉంటుందని, దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే ఈసీఐ ఓటరు కార్డు అందిస్తుందని తెలిపారు. **89 లక్షల మంది 'అనామలీస్' ఓటర్ల గుర్తింపు** తెలంగాణలో తప్పుడు వివరాలు, అక్షర దోషాలు ఉన్న సుమారు 89 లక్షల మంది 'అనామలీస్' ఓటర్లను ఈసీఐ గుర్తించిందని, వారికి త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. 2002 నాటి డాటా లేని ఓటర్లకు నోటీసులు ఇచ్చి ప్రత్యేక సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఏజెన్సీ ఏరియాల్లో 59% ఫారాలు తిరిగి వచ్చాయని, పాతబస్తీలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ఫారాలు అంది డిజిటలైజేషన్ సాగుతున్నదని చెప్పారు. ఓటు లేకపోతే సంక్షేమ పథకాలు ఇస్తరా? లేదా? అనేది ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని ఆయన ఈ సందర్భంగా పేరొన్నారు.ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియ అప్‌డేట్‌ను ఎస్ఎంఎస్ రూపంలో ఎందుకు ఇవ్వడం లేదని అడిగిన ప్రశ్నకు.. ఇది కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమని తెలిపారు. 30 ఏండ్లుగా ఒకే ఇంట్లో ఉంటున్నా, ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొంటున్నప్పటికీ, 'సర్'లో ఓటర్లు తమ ఓటును మళ్లీ పునరుద్ధరించుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. పట్టణ, నగర ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఇండ్ల వద్దకు రావడం లేదన్న ప్రశ్నకు.. వారికి మున్సిపల్ సిబ్బందిని సహాయకులుగా నియమించినట్టు పేర్కొన్నారు.

# హజ్ యాత్రికులకు రూ. 10వేల రీఫండ్

**హైదరాబాద్,జూలై 10 :** హజ్- 2026 యాత్రికులకు సంబంధించి రాష్ట్ర హజ్ కమిటీ శుక్రవారం కీలక ప్రకటన చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు, హజ్ యాత్రికులకు రూ. 10వేల చొప్పున రీఫండ్ చేసే ప్రక్రియను ప్రారంభించినట్లు హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ షా గులాం అఫ్జల్ బియాబాని ఖుస్రో పాషా తెలిపారు.ఈ మొత్తాన్ని నేరుగా యాత్రికుల బ్యాంక్ ఖాతాల్లో ఆన్‌లైన్ కోర్ బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా జమ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. విమాన ఇంధన ధరల పెంపు నేపథ్యంలో, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా సర్క్యులర్ నంబర్ 42 ప్రకారం.. ఇంకా చెల్లించని యాత్రికులు రూ. 10వేల చొప్పున నేరుగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియాకు చెల్లించాలని సూచించారు. ఇప్పటికే 2,871 మంది యాత్రికులు సౌదీ అరేబియాకు వెళ్లినందున, మిగిలిన వారు ఈ నిబంధనను పాటించాలని కమిటీ కోరింది. యాత్రికులు ఈ విషయాన్ని గమనించి, తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# హెల్మెట్ ధరిస్తే శాలువాతో సన్మానం..Arrive Alive'తో రోడ్డు భద్రతపై ములుగు పోలీసుల వినూత్న అవగాహన








**ములుగు, జూలై 10:** రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో ములుగు జిల్లా పోలీసులు »»Arrive Alive -- రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం"ను వినూత్నంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సూచనల మేరకు, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో శుక్రవారం వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్ నగర్ టోల్ ప్లాజా వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ములుగు డీఎస్పీ, ములుగు సీఐ, వెంకటాపూర్ ఎస్ఐలు వాహనదారులతో నేరుగా మాట్లాడి రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్‌తో పాటు ప్రతి ప్రయాణికుడు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని వివరించారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్ ద్వారానే రహదారిని దాటాలని, వాహనం నడిపే ముందు బ్రేకులు, లైట్లు, ఇతర భద్రతా పరికరాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను పోలీసులు శాలువాలతో సన్మానించి అభినందించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు "వేగం కాదు... ప్రాణమే ముఖ్యం -- సురక్షితంగా వెళ్లండి. సురక్షితంగా చేరుకోండి (Arrive Alive)" అనే సందేశాన్ని ప్రజలకు అందిస్తూ ప్రతి ప్రయాణం సురక్షితంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారు లు, సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది, పలువురు వాహనదారులు పాల్గొన్నారు.

# ఉత్సవాలు విజయవంతం కావడానికి అన్ని శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరం

**- సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షిత కృష్ణమూర్తి**



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 10 (పీపుల్స్ న్యూస్) :** ఉత్సవాలు విజయవంతం కావడానికి అన్ని శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షిత కృష్ణమూర్తి అన్నారు. రానున్న శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర -- 2026 ఏర్పాట్లను సమీక్షించేందుకు మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ విశ్వకర్మ ఫంక్షన్ హాల్‌లో ఒక ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ చ. శ్రీధర్, మహంకాళి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎస్. రవికుమార్ లతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఉజ్జయిని మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు, పలహారం బండి, తోటెల నిర్వాహకులు, వెల్కమ్ స్టేజ్ నిర్వాహకులు మరియు ఇతర ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బోనాల జాతరను అత్యంత వైభవంగా, సురక్షితంగా , ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకోవాల్సిన ముఖ్యమైన ఏర్పాట్లు, ముందస్తు భద్రతా చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. నిర్దేశిత పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ సందర్భంగా అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

# అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం - రూ.50 కోట్ల వ్యయంతో నిర్మాణం

**హైదరాబాద్ :** రాష్ట్రంలో మత్స్య రంగం బలోపేతంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే దేశంలో మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణలో చేపల ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో తొలిసారిగా కోహెడలో ఇంటర్నేషనల్ మంచి నీటి చేపల ఎగుమతుల కేంద్రం కొలువు తీరనుంది. 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో కూడిన ఈ మార్కెట్ నిర్మాణం పనులకు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంఖుస్థాపన చేశారు. 2027 ఆగస్టు వరకు ఎగుమతి ఆధారిత అత్యాధునిక



ఫిష్ మార్కెట్ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న దృష్ట్యా ప్రత్యక్షంగా పరోక్షంగా ఐదు వేల మంది ఉపాధి కలుగనుంది. 13 ఎకరాల విస్తీర్ణంలో : తెలంగాణ మత్స్య రంగానికి సరికొత్త గుర్తింపు లభించనుంది. హైదరాబాద్ శివారు కోహెడలో దేశంలోనే మొట్టమొదటిసారిగా మంచి నీటి చేపల అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కానుంది. మోదీ సర్కారు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఈ మెగా ప్రాజెక్టు మంజూరైన నేపథ్యంలో జాతీయ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకుని కోహెడలో పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పునాదిరాయి పడింది. బాహ్య వలయ రహదారి పక్క 13 ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఎగుమతి ఆధారిత అంతర్జాతీయ చేపల మార్కెట్ నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేశారు. దేశంలోనే తొలిసారి : ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టు నిర్మాణం సంబంధించి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించనున్నాయి. దేశంలో ఇప్పటి వరకు కేవలం సముద్రతీర ప్రాంతాల నుంచే సముద్ర చేపల ఎగుమతుల కేంద్రాలు నడుస్తున్నాయి. అయితే మంచి నీటి చేపల ఎగుమతుల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేస్తుండటం దేశంలోనే ఇదే తొలిసారి. నగర శివారు కోహెడలో అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలతో కూడిన అత్యాధునిక ఎగుమతి ఆధారిత చేపల మార్కెట్ ఏర్పాటు కానుండటం పట్ల ఈ ప్రాంతాల్లో మంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతోన్నాయి.

దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ : మంచినీటి వనరుల ద్వారా చేపల ఉత్పత్తిని సాధించడంలో తెలంగాణ ఇప్పటికే దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత సంవత్సరం రూ.8 వేల కోట్లు విలువైన 4.20 లక్షల టన్నులు పైగా మంచి నీటి చేపలు, రూ.1000 కోట్ల రూపాయల విలువైన 15 వేల టన్నుల మంచి నీటి రొయ్యల ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది. అయితే రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఈ మంచి నీటి చేపల్లో 42 శాతం మాత్రమే స్థానికంగా వినియోగం అవుతుండగా కేవలం 6 శాతం మాత్రమే ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మిగిలిన నిల్వలు సరైన మార్కెటింగ్, రవాణా సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి.

రెండేళ్ల క్రితమే మంజూరు : ఈ ఆర్థిక పరమైన గణాంకాలు, అవకాశాలను నిశితంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే ఈ అంతర్జాతీయ ఎగుమతుల కేంద్రం మంజూరు చేసినట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మంత్రిత్వ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించిన విషయం విదితమే. గత నెలలో కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణానికి సీఎం పునాది వేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. "సమాజంలో ముదిరాజుల సంఖ్య చాలా పెద్దది. వారికి, చేపపిల్లలు, గొర్రెపిల్లల్ని ఇచ్చినంత మాత్రాన బాగుపడురు. వారి వృత్తికి అనుగుణంగా కావాల్సిన సదుపాయాలు పొందే విధంగా చేస్తేనే వారి జీవితాల్లో వెలుగు కనిపిస్తుంది. ఇది ఇంటిగ్రేటెడ్? మార్కెట్?. మనదేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నాం. మత్స్యకార వృత్తి చేపట్టిన వారందరి అభివృద్దే దీని ధ్యేయం" - మల్ రెడ్డ రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రంహీంపట్నం, రంగారెడ్డి జిల్లాఅంతర్జాతీయ ప్రమాణాలతో : ఈ అంతర్జాతీయ చేపల ఎగుమతి కేంద్రం నిర్మాణానికి సంబంధించి చెన్నైకు యూనిట్లు, రవాణా ప్రాంగణాలు, సిబ్బంది నివాస గృహాలు కూడా నిర్మించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులు ఒకే చోట : ప్రత్యేకించి వివిధ సాంకేతిక సంస్థలు, అధునాతన చేపల పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ ఎగుమతులకు తక్షణ అనుమతులు ఇచ్చే అపెడా, కస్టమ్స్ క్లియరెన్స్ కేంద్రాలు కూడా ఇక్కడే ఒకే ఛత్రం కింద ఏర్పాటు కానున్నాయి. దాదాపు రెండు వేల మంది పైగా జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులు ఒకే చోట క్రయ, విక్రయాలతో ఏటా 500 కోట్ల రూపాయలు పైగా లావాదేవీలు జరిపేలా ఈభారీ టోకు మార్కెట్ ఈ ప్రాంగణంలో అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటన్న చర్యలకు మనం మద్ధతివ్వాలని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. "ఈ ప్రాంతం నుంచి సుమారు 9 దేశాలకు, ప్రపంచ మార్కెట్?ను తలదన్నే విధంగా మంచి నీటి చేపల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నాం. వీటి ఉత్పత్తిలో రాష్ట్రాన్ని బ్రాండ్?గా చేయడానికి సర్కార్? యోచిస్తోంది. దీని ద్వారా ఆర్థిక వనరులు పెరుగుతాయి. రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసి మత్స్య రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తాం" - వాకిటి శ్రీహరి, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రిసదుపాయాల సంస్థ చేపట్టనుంది.

# బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుని కుటుంబాన్నీ పరామర్శించి ఆర్థిక సహాయం అందించి ఎల్లప్పుడూ అండగా ఉంటా భూక్య జంపన్న




**గోవిందరావుపేట ములుగు జిల్లా ప్రతినిధి జూలై 10 (పీపుల్స్ న్యూస్ )** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం రాంనగర్ తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమకారుడు జన్ను సుధాకర్ తల్లి కీ.శే. జన్ను లక్ష్మీ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న వారి నివాసానికి వెళ్లి మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జన్ను సుధాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన భూక్య జంపన్న, వారి కుటుంబనికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ ఉద్యమకారులు, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి, భవిష్యత్తులో కూడా అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లకావత్ నరసింహ నాయక్,రామ్ నగర్ మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, దుంపలగూడెం సర్పంచ్ సీతారాం నాయక్, బాలాజీ నగర్ సర్పంచ్ మాలోతు గాంధీ, సీనియర్ నాయకులు కృష్ణారావు, అజ్మీర సమ్మయ్య,భగవత్, సారయ్యమండల మాజీ యూత్ అధ్యక్షుడు జన్ను రాంబాబు,కొంపెల్లి రవీందర్, వార్డ్ నెంబర్ మౌనిక చందు, బానోతు రాజు నాయక్, జన్ను ఐలయ్య, దామరాజు రవీందర్, ఆలోత్ ప్రశాంత్, అజ్మీర సుమన్, కిషోర్, మహమ్మద్ అఖిల్ మైనార్టీ నాయకులు, వంశీ, కళ్యాణ్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు చేపట్టిన పులి శివకుమార్ గౌడ్.

**బాలానగర్ జలై 11 (పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పులి శివకుమార్ గౌడ్ శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో ఆయనను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పులి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి పార్టీకి కీలక బాధ్యతలు అప్పగించిన బండి రమేష్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేరవేస్తూ బాలానగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యమని పేర్కొంటూ, ముఖ్యంగా



పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రతి బూత్ స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసే దిశగా కార్యాచరణ చేపడతానన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తే ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొంటూ, పులి శివకుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతన బాధ్యతలు స్వీకరించిన పులి శివకుమార్ గౌడ్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన నాయకత్వంలో బాలానగర్ డివిజన్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

శనివారం, జూలై 11, 2026 | పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 4

# ఘనంగా కేకే జన్మదిన వేడుకలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/జూన్10**
కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు హమీదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు,బర్డే కేకును కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో కట్ చేసి టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు,ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు,హమీద్ లు మాట్లాడుతూ అసలు సిసలైన తెలంగాణ వాది ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తూ సాదాసీదా జీవితం గడిపే వ్యక్తి కేకే మహేందర్ రెడ్డి అన్నారు,నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజల పక్షాన ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత కూడా నిజాయితీగా ఉన్న వ్యక్తి కేకే మహేందర్ రెడ్డి అన్నారు, రాజకీయాలకు రాకముందే ఉద్యమ కారుడిగా తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేశాడని,వామపక్ష భావజాలం కలిగి అట్టడుగు ప్రజలకు సేవ చేసిన చరిత్ర మహేందర్ రెడ్డి కే దక్కుతున్నదన్నారు,ప్రభుత్వం ఏర్పడ్డాక సిరిసిల్ల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తున్న వ్యక్తి మహేందర్ రెడ్డి అన్నారు,మహేందర్ రెడ్డి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామని పర్శ హన్మాండ్లు హమీదులు పేర్కొన్నారు,నాయకులు గంగి స్వామి రాజనర్సింహారెడ్డి,చేకూరి మహేష్,బలరాం రెడ్డి,అంజా గౌడ్,ఎలుక రాజు,నర్సింలు,శెట్టి రవి, అంజిరెడ్డి,రాఘవేంద్రరెడ్డి,పోచయ్య,నాంపల్లి,శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్, అజం,లక్ష్మణరావు,భగవంతురావు, భాస్కర్, భాస్కర్ నాయక్,రాజయ్య,వెంకటి,బాల్ రెడ్డి,అన్నీ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం పరిశీలన...!

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ...!!**



**జనగామ, జూలై 10:** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, త్రైమాసిక తనిఖీలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో గల ఈవీఎం గోదాంను...జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ శుక్రవారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా నమోదు పుస్తకం, సీసీ కెమెరాల పని తీరు, మంటల నియంత్రణ పద్ధతులను పర్యవేక్షించారు. భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జనగామ ఆర్డీఓ గోపీరాం, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# రేనికుంట పిఏసిఎస్ చైర్మన్ గా నమిల మహేందర్ గౌడ్

**- నమ్మినబంటుకు అరుదైన గౌరవం....**



**రాజాపేట, జూలై 10:**
కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు నమ్మినబంటుగా ఉంటూ ఎనలేని సేవలు అందిస్తున్న రాజపేటకు చెందిన నమిల మహేందర్ గౌడ్ కు పార్టీ పరంగా తగిన గౌరవం దక్కింది. రాజాపేట మండలం రేణిగుంట పిఎసిఎస్ చైర్మన్ గా నమిల మహేందర్ గౌడ్ నామినేట్ అయి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. తన 36 సంవత్సరాలు రాజకీయ జీవితంలో కాంగ్రెస్ పార్టీలోనే 54 సంవత్సరాలైనా మహేందర్ గౌడ్ కొనసాగుతుండగా, మొదటిసారి ప్రజాప్రతినిధిగా ఆయన ఎంపికయ్యారు. ఎలాంటి ఇతర వ్యాపకాలు లేకుండా కేవలం రాజకీయంగానే పూర్తి సమయం కేటాయిస్తూ పార్టీకి ప్రజలకు కార్యకర్తలకు నమిల మహేందర్ గౌడ్ ఎనలేని సేవలందిస్తున్నారు. ఇతర పార్టీలు సైతం మహేందర్ గౌడ్ నిబద్ధత పట్ల అభినందిస్తారు. 1990 లో రాజకీయంగా యువజన కాంగ్రెస్ ద్వారా అరంగేట్రం చేసిన నమిల మహేందర్ గౌడ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా కొనసాగారు. పొంగులేటి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నియమితులైన మహేందర్ గౌడ్ ఆలేరు ఓబిసి జిల్లా ఉపాధ్యక్షులు గా కొనసాగారు 2004 నుండి 2010 వరకు ఓబీసీ మండల అధ్యక్షులుగా మహేందర్ నియమితులయ్యారు. తర్వాత 2019లో రాజపేట ఎంపీటీసీ స్థానానికి పోటీ చేసి ఓటమిపాలయ్యాడు. మొక్కవోని ధైర్యంతో ప్రజల మధ్యనే ఉంటూ పార్టీకి సేవలు చేస్తూ కొనసాగుతున్న మహేందర్ గౌడ్ 2016 నుండి పది సంవత్సరాలపాటు రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొనసాగారు. అసెంబ్లీ ఎన్నికల్లో 1994లో డాక్టర్ నగేష్, ఎంపీ ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో మోత్కుపల్లి నరసింహులుకు 1999లో గెలుపు కోసం కృషి చేశారు. రాజకీయ పరిస్థితులు వేగంగా మారడంతో ఆయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కలేదు. అయినప్పటికీ పార్టీ అధిష్టానం నిర్ణయించిన వ్యక్తికి గెలుపు కోసం మహేందర్ గౌడ్ అహర్నిశలు కృషి చేసారు. మిగతా పార్టీల నాయకులు సైతం మహేందర్ గౌడ్ రాజకీయంగా చేస్తున్న సేవలను కొనియాడుతూ ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఎట్టకేలకు తన 36 సంవత్సరాల రాజకీయ జీవితంలో మొదటిసారి రాజకీయ ప్రజాప్రతినిధిగా ప్రభుత్వ విప్ అలేరి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో నియమితులయ్యారు. దీంతో మహేందర్ గౌడ్ స్నేహితులకు అభిమానులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలకు ఎనలేని ఆనందం కలిగింది. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ నమిల మహేందర్ గౌడ్ ను అభినందించారు.

# మంగపేట, మల్లూరు, కాటాపురం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాల తగ్గింపుపై ప్రత్యేక దృష్టి

**- ఏటూరునాగారం డివిజన్‌లో ఫీడర్ల పనితీరును సమీక్షించిన టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**










**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 10 (పీపుల్స్ న్యూస్)**
సమస్యాత్మక ఫీడర్లపై 14 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశంటీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ,ఐఏఎస్ శుక్రవారం ములుగు సర్కిల్‌లోని ఏటూరునాగారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించి విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించి వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఫీడర్ల పనితీరు, ట్రిప్పింగ్స్ పరిస్థితి, అటవీ ప్రాంతాల్లో లైన్ల భద్రత తదితర అంశాలపై ఆయన సమగ్రంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా 33 కేవీ, 11 కేవీ ఫీడర్లలో తరచూ సంభవిస్తున్న అంతరాయాలు, ట్రిప్పింగ్స్‌కు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయరహిత విద్యుత్ సరఫరా అందించే దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎండీ ముందుగా 132/33 కేవీ కమలాపురం సబ్‌స్టేషన్‌ను సందర్శించి, అక్కడి నుంచి విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీ మంగపేట, మల్లూరు ఫీడర్లలో తరచూ చోటుచేసుకుంటున్న ట్రిప్పింగ్స్‌కు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ఫీడర్లపై ప్రత్యేక దృష్టి సారించి, అంతరాయాల మూలకారణాలను గుర్తించి నివారణ చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.అ లాగే 132/33 కేవీ కమలాపురం నుంచి 33/11 కెవి మల్లూరు వరకు కొత్తగా వేసిన ఇంటర్ లింకింగ్ లైన్ ను పరిశీలించిన సీఎండీ వినియోగంలోకి తీసుకు రావాలని చెప్పారు . అనంతరం 33/11 కెవి మంగపేట సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ అక్కడి లాగ్‌బుక్‌ను పరిశీలించి 11 కేవీ ఫీడర్లలో తరచూ సంభవిస్తున్న అంతరాయాలపై ఫీల్డ్ సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పునరావృతమవుతున్న అంతరాయాలకు కారణమవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి 14 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ఆ ప్రణాళికలో పేర్కొన్న పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని డీఈని ఆదేశించారు. అనంతరం 33/11 కెవి మల్లూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సీఎండీ అక్కడ కొనసాగుతున్న రియల్ టైం ఫీడర్ మానిటర్ పనుల పురోగతిని సమీక్షించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను అత్యంత త్వరగా పూర్తి చేయాలని నిర్మాణ విభాగం డీఈకి సూచించా రు. 33 కేవీ కాటాపురం ఫీడర్‌ను పరిశీలించిన సీఎండీ , 33/11 కెవి కాటాపురం సబ్‌స్టేషన్‌ను కూడా సందర్శించారు. కాటాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ, 11 కేవీ లైన్లలో తరచూ చోటుచేసుకుంటున్న ట్రిప్పింగ్స్‌ను తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేసే పనులను చేపట్టాలని ఏడీఈ తాడ్వాయికు ఆదేశించారు. ముఖ్యంగా అటవీ, చెట్లతో నిండిన ప్రాంతాల్లో లైన్ అంతరాయాలను తగ్గించేందుకు ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నాణ్య మైన , మెరుగైన విద్యుత్ సరఫరాలో అందించడం టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, ఫీల్డ్ స్థాయిలో అధికారులు సమస్యాత్మక ఫీడర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి, వినియోగదారులకు అంతరాయరహిత విద్యుత్ అందించే దిశగా వేగంగా చర్యలు చేపట్టాలని సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు
సీఎండీ వెంట ఎస్ఈ ఆపరేషన్ ములుగు బిక్షపతి, డీఈ టెక్నికల్ భాస్కర్, డీఈ ఆపరేషన్ ఏటూరునాగారం జె. పురుషోత్తం, ఏడీఈ ఆపరేషన్ ఏటూరునాగారం బి. ఉమారావు, ఏఈ ఆపరేషన్ కమలాపురం, ఏఈ ఆపరేషన్ ఏటూరునాగారం, ఏడీఈ తాడ్వాయి, ఏఈ కమర్షియల్ ములుగు రాజేష్, మహేందర్ రెడ్డితో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు

# శివశంకర్ నగర్ డ్రైనేజ్ సమస్యపై మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ చొరవ

- స్థానికుల ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- రెండు రోజుల్లో పూర్తి పరిష్కారం చేస్తామని

**జలమండలి అధికారుల హామీ**



**బాలానగర్ జలై 11 (పీపుల్స్ న్యూస్)**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివశంకర్ నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తక్షణమే స్పందించారు. ఈ నేపథ్యంలో కాలనీలోని ఎస్‌టీపీ సమీపంలో డ్రైనేజీ పైప్‌లైన్లు మూసుకుపోవడంతో మురుగునీరు నిలిచిపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో ఆయన శుక్రవారం ప్రత్యక్షంగా అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలుసుకున్న పండాల సతీష్ గౌడ్, వెంటనే జలమండలి అధికారి హిమజతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఎస్‌టీపీలో జేసీబీని వినియోగించి ఔట్‌లెట్‌ను వెంటనే శుభ్రం చేయాలని సూచిస్తూ తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. వెంటనే స్పందించిన జలమండలి అధికారులు రెండు రోజుల్లో డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కాలనీలోని బస్తీల్లో డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్టును తొలగించడం లేదన్న స్థానికుల ఫిర్యాదును కూడా మాజీ కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కూడా త్వరితగతిన చర్యలు చేపట్టి శుభ్రపరిచే పనులు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పండాల సతీష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. కాలనీల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో శివశంకర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్, సాయినాథ్ గౌడ్, నాగేష్, భిక్షపతి, బరిగేల శ్రీను, కరుణాకర్, కిరణ్, శేఖర్, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొని సమస్యను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానికులు వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన పండాల సతీష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# గీత కార్మికుల పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి : బొమ్మగాని ప్రభాకర్



**భువనగిరి అర్బన్, జూలై 10 :** గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గీత పనివారాల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ముఖ్య నాయకుల సమావేశం భువనగిరి సిపిఐ పార్టీ ఆఫీసు ధర్మం భిక్షం భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకుడు, అఖిల భారత గీత కార్మిక ఉద్యమ నాయకుడు బొమ్మగాని ధర్మభిక్షం నాయకత్వంలో రాష్ట్రంలో కల్లుగీత సొసైటీలు, టీఎఫ్‌టీలు ఏర్పాటు చేశారన్నారు. గీత కార్మికులకు పెన్షన్స్, ఎక్స్‌గ్రేషియా, కార్మికుల హక్కుల కోసం తాటి, ఈత వనములు పెంచుకొనుటకు జీవో 560 ప్రకారంగా ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమిని ఇచ్చే విధంగా గీత వృత్తిని ఆధునీకరించాలని చెప్పారు. గీత పరిశ్రమలు నెలకొల్పుటకు, గీత కార్మికుడు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడినచో ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 50 సంవత్సరాల పైబడిన గీత కార్మికులకు వృత్తి పెన్షన్ ఇవ్వాలని, ప్రతి జిల్లాలో నీరా కేంద్రాలను ఏర్పరచి పరిశ్రమగా రూపొందించాలని డిమాండ్ చేశారు. ఆయా జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను వెంటనే చెల్లించాలని, గీత కార్మికుల వృత్తి పెన్షన్ రూ. 2 వేలను రూ. 5 వేలకు పెంచాలని, తాటి చెట్టుపై నుండి కిందపడి మరణించినచో రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, చనిపోయిన కార్మికుడి వృత్తి పెన్షన్ వస్తే అతడు మరణించినచో అట్టి పెన్షన్‌ను భార్యకు వృత్తి పెన్షన్ వర్తింపజేయాలన్నారు. భువనగిరి జిల్లాలో ఉన్న నందనంలోని నీరా పరిశ్రమ కేంద్రాన్ని ఆధునికరిం చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గీత పనివారల సంఘం రాష్ట కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా గీత పనివారల సంఘం అధ్యక్ష కార్యదర్శుడు చాపల అంజయ్య, నాయకులు పబ్బు యాదయ్య, ఎర్ర రమేశ్, పందుల యాదగిరి, బాలగోని సత్యనారాయణ, గాదెగాని మాణిక్యం, గుండు వెంకటేష్, తండా యాదయ్య, పుట్ట రమేష్ పాల్గొన్నారు.

# హోరెత్తిన రైతు ఆశీర్వాద సభ...

●కదం తొక్కిన రైతులు.

●ఔర్ ఏక్ బార్. కాంగ్రెస్ సర్కార్. సీఎం రేవంత్ రెడ్డి











**ఖమ్మం / చింతకాని/ జులై 10 /( పీపుల్స్ న్యూస్ )** ఖమ్మం జిల్లా చింతకాని మండలం లో మట్కేపల్లి చౌరస్తాలో లక్షల మందితో రైతు ఆశీర్వాద సభ విజయ దంకా మోగించింది. రాష్ట్ర నలుమూలల నుండి జిల్లా చుట్టుపట్ల నుండి రైతులు, మహిళా రైతులు, తండోప తండాలుగా తరలివచ్చారు. ఈ రైతు మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి విచ్చేసి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకంటే ముందు తెలంగాణ రాష్ట్ర గీతం జయహే తెలంగాణ గీతాన్ని రైతులు,నాయకులు ఏకకంఠం తో ఆలపించారు ముఖ్యమంత్రి మాట్లాడుతూ... నా రాజకీయ జీవితంలో పాలమూరు నా ప్రాణమైతే, ఖమ్మం జిల్లా నాకు గుండెకాయ లాంటిది అని అన్నారు అలాగే 2023 లో శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారధ్యంలో.. కాంగ్రెస్ పార్టీలో చేరికతో ఖమ్మం జిల్లా అంత తరలివచ్చి అవినీతి బి ఆర్ ఎస్ పార్టీని తరిమికొట్టారు. జరగబోయే కురుక్షేత్రంలో కౌరవ సామ్రాజ్యం అంటే, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా తరిమికొట్టాలన్నారు. పాపాల భైరవుడు కేసీఆర్ ను ఫామ్ హౌస్ లోనే శాశ్వతంగా బంధించాలి అన్నారు. భద్రాచలం రాముల వారి ఆశీస్సులతో, ఖమ్మం ప్రజల చల్లని దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి 2029 లో మరల పట్టం కట్టాలి అని, రైతులకు కార్యకర్తల కు ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసి మరల ఇదే వేదికలో దేశ నలుమూలల నుంచి పది లక్షల మంది రైతులతో మహా రైతు విజయ సభను జరుపుకుందామని రైతులకు కార్యకర్తలకు సభకు విచ్చేసిన ప్రజలకు విజయ చిహ్నం చూపించారు. సభా వేదిక నుంచి రైతు భరోసా నిధులను విడుదల చేశారు అలాగే రైతు నూతన పట్టా పాస్ పుస్తకాలు రైతులకు అందజేశారు. మధిర పట్టణానికి నూతన ఇంజనీరింగ్ కాలేజ్ ను ఇస్తున్నట్లు ప్రకటించారు. ముగింపులో ఔర్ ఏక్ బార్... కాంగ్రెస్ సర్కార్.. అని రైతులతో ప్రజలతో నినదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, భట్టి విక్రమార్క,శ్రీ తుమ్మల నాగేశ్వరావు, శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి,వేం, నరేందర్ రెడ్డి, వాకిటి శ్రీహరి, బలరాం నాయక్, ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మేయర్లు కార్పొరేటర్లు సర్పంచులు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపాలి

- మండల వ్యవసాయ శాఖ అధికారి వాహిని



**( దంతాలపల్లి)** వర్షాభావ పరిస్థితులపై ప్రత్యామ్నాయ మరియు పంటలపై మార్పిడి అవగాహన సదస్సును శుక్రవారం దంతాలపల్లి మండల పరిధిలోని గున్నేపల్లి గ్రామంలో మరియు పెద్ద ముప్పారం గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాహిని గారు హాజరై ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలైన పెసర్లు కందులు మినుములు ఆయిల్ పామ్ బొబ్బర్లు జొన్నలు ఎంపిక చేసుకోవాలని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అలాగే పంట మార్పిడి ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు దిగుబడులు ఆదాయం పెరుగుతాయని వివరించారు. రైతులకు ప్రభుత్వ సూచనలు శాఖ అందిస్తున్న సేవలు వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సమగ్ర పంట నిర్వహణపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నుంచి ఇరిగేషన్ ఏఈ భరత్ పాల్గొని నీటి వనరులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గున్నేపల్లి రైతు వేదిక యందు గున్నేపల్లి గ్రామ సర్పంచ్ పొన్నాల ప్రణవి ఉమేష్ రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారి ఆమని పెద్దముప్పారం రైతు వేదికలో క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఉదయ్ కిరణ్
రైతులు మరియు గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల హక్కుల పరిరక్షణపై పోరాడుదాం

- ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ కేసులను కఠినంగా అమలు చేయాలి.
- ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్





**(దంతాలపల్లి)** రాజ్యాంగం దళితులకు ఇచ్చిన హక్కులు పరిరక్షణకై దళితులు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ ఎస్సి జన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంతం విజయేందర్ రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్ కోరారు. ఈ సందర్భంగా సంయుక్తంగా మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం హక్కులు సమానత్వం న్యాయం కోసం జరిగే ఉద్యమాలలో దళిత బిడ్డలంతా భాగస్వాములు కావాలనిపిలుపునిచ్చారు. దళితులపై జరుగుతున్న దాడులు అన్యాయాలను అరికట్టాలని దళితులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. భూమి లేని నిరుపేదలకు సాగు భూమిని ఇంటి స్థలాలను అందజేయాలి అని డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లను అమలు చేయాలి,దళిత విద్యార్థులకు స్కాలర్షిప్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు, దళిత విద్యార్థులకు యువతకు ప్రభుత్వ ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులవివక్షత నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చే నిధులను దుర్వినియోగం కాకుండా దళితుల సంక్షేమనికి కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జన సంఘం నాయకులు రమేష్ వెంకన్న వీరస్వామి శివశంకర్ ఉపేందర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

●ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలి

●భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 10 (పీపుల్స్ న్యూస్ )** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ--2026 కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ఈ నెల 24వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200 మందికి మించి ఓటర్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.06 శాతం పూర్తయిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ 33.31 శాతం పూర్తయిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. ప్రతి బీఎల్ఓ రోజుకు కనీసం 15 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని, ప్రతి బీఎల్ఓకు ముగ్గురు వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి సహకారం అందించాలని సూచించారు. అలాగే ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి, ఎన్నికల సూపరింటెండెంట్ సలీమ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి'




**భువనగిరి అర్బన్, జూలై 10 :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్లు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో అన్ని విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి ప్రిన్స్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు పుస్తకాలు పూర్తి స్థాయిలో అందలేదన్నారు. యూనిఫాంలు ఏ ఒక్క విద్యార్థికి అందించలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారిందన్నారు. అక్షయపాత్ర, ఇస్కాన్, మన్నావంటి సంస్థల ద్వారా అందిస్తున్న భోజనం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గత 45 సంవత్సరాల క్రితం కట్టిన భవనాలు శిథిల వ్యవస్థకు చేరినాయని వర్షాకాలం వాన కురిస్తే పూర్తిగా కూలి విద్యార్థుల మీద పడి ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన భవనాలు నిర్మించాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలని, ఒక పాఠశాలలో 30 మందికి ఒకటే టీచర్ ను కేటాయించడం సరికాదని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయని. పుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, టైలు, షూలు, సాక్సులు తదితర వస్తువులను విద్యార్థులపై బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారని అన్నారు. పాఠశాలలకు ఆకర్షణీయమైన పేర్లు జోడించి ప్రచారం చేస్తూ నర్సరీ స్థాయి నుంచే లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారని రాష్ట్రంలో ఫీజులు నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో సుమారు 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4,000 పాఠశాలలుగా కుదించే ప్రతిపాదన ప్రభుత్వ విద్యా వ్యవస్థకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలను మూసివేస్తు మరో పక్క ప్రైవేట్ విద్యా సంస్థలను ఓపెన్ చేస్తున్నారని, పాఠశాలల సంఖ్యను తగ్గించకుండా జనాభా ప్రాతిపదికన కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. చింతల శివ, కమిటీ సభ్యులు నేహాల్, సన్నీ, భాను ప్రసాద్, జిల్లా నాయకులు ఎల్.జగదీష్, మున్నా, నవీన్, గాంధీ పాల్గొన్నారు.

# మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడి విజయవంతం

- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



**హైదరాబాద్,** విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ నేడు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి యత్నించారు ఈ సందర్భంగా పోలీస్ మరియు విద్యార్థి నేతల మధ్యలో స్వల్ప తోపులాట జరిగింది ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఏ.ఐ.ఎస్.బి , ఏ.ఐ.ఎస్. ఎఫ్, ఎస్.ఎఫ్. ఐ, పి.డి.ఎస్.యు, ఏ.ఐ.ఎఫ్. డి.ఎస్ , పి.డి.ఎస్.యు, ఏ.ఐ.పి. ఎస్.యు సంఘాల నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు విద్యా సంవత్సరం ప్రారంభమైన ఇప్పటివరకు ప్రభుత్వ విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డ్రెస్సులు సకాలంలో ప్రభుత్వం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారన్నారు , అంతేకాకుండా రాష్ట్రంలో కొన్ని ఏళ్లుగా పెండింగ్లో ఉన్న వేల కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్మెంట్ స్కాలర్షిప్ నిధులను విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వారు ఆరోపించారు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కుదించే ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని వారు సూచించారు పెండింగ్లో ఉన్నటువంటి రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను తక్షణమే విడుదల చేస్తూ ప్రభుత్వ కళాశాలలో మధ్య భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి కోరారు అంతే రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం 2009 నీ అమలు చేసి నూతన జాతీయ విద్యా విధానం 2020 కి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేస్తూ , కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టడానికి ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడి సందర్భంగా డిమాండ్ చేశారు.

# మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్.. ప్రమాద బాధితుడికి సకాలంలో ప్రాణరక్షణ





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 10 ( పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా కన్నాయిగూడెం స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎస్ కే లాల్ మహమ్మద్ విధి నిర్వహణలో భాగంగా ములుగు కేంద్రంలో డ్యూటీ ముగించుకుని కన్నాయిగూడెం పోలీస్ స్టేషన్‌కు తిరుగు ప్రయాణిస్తున్న క్రమంలో తన మానవత్వాన్ని చాటుకున్నారు చింతగూడెం గ్రామ సమీపం లో ఓ వ్యక్తి స్వీయ ప్రమాదానికి (సెల్ఫ్ యాక్సిడెంట్) గురై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించిన వెంటనే స్పందించి ఆలస్యం చేయకుండా 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు, వాహనం సంఘటనా స్థలానికి చేరుకున్న అనంతరం బాధితుడిని అంబులెన్స్‌లో ఎక్కించి ఎటూర్ నాగారం సీహెచ్‌సీ కు తరలించేలా చర్యలు చేపట్టారు.ప్రమాద బాధితుడి ప్రాణాలను కాపాడేందుకు సకాలంలో స్పందించిన పోలీస్ కానిస్టేబుల్ ఎస్కే లాల్ మహమ్మద్ మానవత్వానికి నిదర్శనంగా నిలిచారని స్థానికులు కొనియాడారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయన సేవాభావాన్ని అభినందిస్తూ, విధి నిర్వహణతో పాటు సామాజిక బాధ్యతను చాటుకున్నారని ప్రశంసించారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలి

- క్షేత్రస్థాయిలో సర్ నిర్వహణ పైఆర్డీవోలకు తాసిల్దారులకు గూగుల్ మీట్ నిర్వహణ
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్




**మెదక్,జులై,10)**
పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.ఎస్ఐఆర్ లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ క్షేత్రస్థాయిలో సర్ నిర్వహణ పై ఆర్డీవోలకు తాసిల్దారులకు గూగుల్ మీరు ద్వారా ఆమె సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను జిల్లాలో పారదర్శకంగా చేపట్టాలని ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయ్యింది, ఓటర్లు అందరికీ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తయిందా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం అందించాలని, గడువు లోపు వారు తమ ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి అందించేలా చూడాలన్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఎన్యూమరేషన్ ఫారంలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకోవచ్చని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ను ఏకకాలంలో సమాంతరంగా నిర్వహించాలని అన్నారు. ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.. ఓటర్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఓటరు మ్యాపింగ్ విషయంలో సహకారం అందించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ దగ్గర ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తిస్తూ, ఓటరు జాబితాలో మార్కింగ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఓ లకు తగిన సహకారం అందించాలని అందిం చాలన్నారు.ఈ కార్యక్రమంలో , మెదక్ ఆర్డిఓ రమాదేవి, ఎన్నికల సూపరిండెంట్ గఫార్, ఆర్డీవోలు, తాసిల్దారులు ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అధికార యంత్రాంగం చర్యలు



**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 10 (పీపుల్స్ న్యూస్) :**
హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రజా భద్రతను మెరుగుపరచడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా అధికార యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అధ్యక్షతన టీజీఐసీసీసీలో శుక్రవారం కీలక సమన్వ య సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో హెచ్ఎండీఏ కమిష నర్ సర్ఫరాజ్ అహ్మద్, , హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్ గోపిడి, లతో పాటు ఎన్‌హెచ్ఏఐ, జీహెచ్ఎంసీ, హెచ్‌జీసీఎల్, ఐఆర్బీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీలు, అదనపు డీసీపీలు పాల్గొన్నారు. గత మే నెలలో ఓఆర్ఆర్ పై జరిగిన సమన్వయ సమావేశంలో చర్చించిన అంశాల పురోగతిపై ఈ సందర్భంగా సమీక్షించారు. ఇందులో భాగంగా రహదారి భద్రతపై తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు 80 క్రిటికల్ స్పాట్స్ ను గుర్తించినట్లు, వీటిలో ఇప్పటికే కొన్ని చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టం చేసినట్లు వివరించారు. ఓఆర్ఆర్ పై ప్రమాదాల నివారణకు ఏఐ ఆధారిత ఎలక్ట్రానిక్ ఎన్ఫోర్స్మెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తీసుకువచ్చే అవకాశాన్ని పరిశీలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అత్యాధునిక సాంకేతికత ద్వారా వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను సులభంగా గుర్తించి చర్యలు తీసుకోవచ్చని, దీనివల్ల పదే పదే నిబంధనలను ఉల్లంఘించే ధోరణికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. ఓఆర్ఆర్ పై నమోదవుతున్న ఉల్లంఘనల్లో దాదాపు 99 శాతం వాహనాలు రీపీటెడ్ వైలేషన్స్ కు పాల్పడుతున్నాయని, అలాంటి వాహనదారుల్లో మార్పు తీసుకువచ్చేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించా రు. ఓఆర్ఆర్ పై వాహనాలు మొరాయించడం (బ్రేక్ డౌన్) వంటి ఘటనలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని, ఇలాంటి వాహనాలను వీలైనంత త్వరగా అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అలాగే రోడ్డుపై ఎక్కడా వాహనాలు నిలపకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఒకవేళ వాహనాలు ఆగిపోతే, తక్షణమే 14449 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఓఆర్ఆర్ పై ప్రయాణికుల రక్షణే పరమావధిగా



హెచ్ఎండీఏ తరఫున అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఓఆర్ఆర్ ప్రయాణాన్ని మరింత సురక్షితంగా మార్చేందుకు అన్ని విభాగాల సమన్వయంతో పనిచేస్తూ.. తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద తగిన రక్షణ చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కీలక సమావేశంలో హైదరాబాద్ అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ సన్ ప్రీత్ సింగ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఐఆర్బీ సీనియర్ జనరల్ మేనేజర్ చాంద్ భాషా, ఎన్‌హెచ్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రవణ్ ప్రకాశ్, ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ హెడ్ ఎం. గిరిశ్వర్, ఎన్‌హెచ్ హైదరాబాద్ సైట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాను మిశ్రా, జీహెచ్ఎంసీ సీనియర్ ఇంజనీర్లు నరేందర్ గౌడ్, కిష్టప్ప పాల్గొన్నారు. వీరితో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, సైబరాబాద్ కుత్బు ల్లాపూర్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ శ్రీ నివాసులు, సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ ఎస్. రవి కుమార్ , ప లువురుట్రాఫిక్ అదనపుడీసీపీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ముత్తంగి డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ: సేవాభావంతో ముందుకొచ్చిన శాపురం నర్సింహా రెడ్డి



**పటాన్‌చెరు, జూలై 10:**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ముత్తంగి పరిధిలోని వెలిమెల, సందుగూడెం మరియు వెలిమెల తండా గ్రామాల్లో నిత్యం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముత్తంగి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాపురం నర్సింహా రెడ్డి , కార్మికులకు స్వయంగా చీరలను అందజేశారు. సమాజానికి వెన్నెముక పారిశుద్ధ్య కార్మికులు: శాపురం నర్సింహా రెడ్డిఈ సందర్భంగా శాపురం నర్సింహా రెడ్డి




మాట్లాడుతూ.. "ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం ఎండనక, వాననక నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముక వంటి వారు. వారి నిస్వార్థ సేవలను గుర్తించి, వారికి అండగా నిలవడం మనందరి బాధ్యత" అని కొనియాడారు.ముత్తంగి డివిజన్ ప్రజలకు నిరంతరం సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షే మం కోసం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుల ముఠా

- ఒకరు అరెస్టు, పరారీలో ముగ్గురు నిందితులు



**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 10 (పీపుల్స్ న్యూస్) :**
బస్సు ప్రయాణికుల దృష్టి మళ్లించి బంగారు గొలుసుల దొంగతనాలకు పాల్పడుతున్న ఒక అంతర్రాష్ట్ర/వ్యవస్థీకృత నేరాల ముఠా ను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 4 బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... 2025 అక్టోబర్ 16న ఉదయం సుమారు 09:45 గంటల సమయంలో, బండ్లగూడ జాగీర్ (గండిపేట్) నివాసి గాజుల సతీష్ కుమార్ (45 ) అత్తాపూర్ పిలార్ నంబర్ 143 సమీపంలో బస్సు ఎక్కారు. ఆ సమయంలో నిందితులు అఫ్జల్ సాగర్ ,మంగర్ బస్తీ కి చెందిన హథకడే విశాల్ (25 ) , రవి ,జహంగీర్ ,శ్యామ్ సుందర్ లు ఒక ముఠాగా ఏర్పడి సతీష్ కుమార్ మెడలోని బంగారు గొలుసును గమనించారు.బాధితుడు ఆరామ్‌ఘర్ బస్ స్టాండ్ వద్ద బస్సు దిగడానికి ఫుట్‌బోర్డ్‌పై నిలబడినప్పుడు, ఈ నలుగురు నిందితులు అతనిని చుట్టుముట్టారు. ప్రణాళిక ప్రకారం, నిందితులు రవి ,జహంగీర్ బాధితుడు క్రిందికి దిగకుండా అడ్డుకోగా, శ్యామ్ సుందర్ , హథకడే విశాల్ అతనిని ముందుకు తోస్తూ దృష్టి మళ్లించారు. ఈ రద్దీని ఆసరాగా చేసుకుని, ప్రధాన నిందితుడు హథకడే విశాల్ తన చేతితో బాధితుడి మెడలోని 1.25 తులాల బంగారు గొలుసు హుక్‌ను తెంపి, దొంగిలించి అక్కడి నుండి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి నుండి 4 బంగారు గొలుసులను స్వాధీనం చేసుకుని హథకడే విశాల్ ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. పోలీసుల విచారణలో నిందితులు హథకడే విశాల్ ,రవి ,జహంగీర్ ,శ్యామ్ సుందర్ లు అందరూ అలవాటు పడిన పాత నేరస్థులని, గతంలోనూ పలు ఆస్తి నేరాలలో భాగస్వాములై ఉన్నారని తేలింది. గతంలో నిందితుడు హథకడే విశాల్ జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. వీరంతా జులాయి తిరుగుళ్లకు, వ్యసనాలకు బానిసలై తమ విలాసవంతమైన జీవితం కోసం ఒక వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడి, ఆరామ్‌ఘర్ ఎక్స్ రోడ్ బస్ స్టాండ్ పరిధిలో అమాయక ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద నేరారోపణలు నిరూపితమయ్యాయి. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, పర్యవేక్షణలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ టి. శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో, అత్తాపూర్ ఎస్‌హెచ్ఓ కె. నాగేశ్వరరావు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. రాజు నాయక్ నేతృత్వంలోని క్రైమ్ బృందం ఈ నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని సొత్తును రికవరీ చేసింది. ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించి, పారితోషికాలను ప్రకటించారు.

# సంపాదకీయం

## ఎత్తిపోతల పంచాయితీ !



కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తేలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్దం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి. ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కాపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేల్చాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహారిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది. బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఏపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్టులను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తక్కువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు బ్యారేజీల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్దతుల్లో బ్యారేజీలను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజనీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభ నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం అత్యవసర కార్యాచరణ సిద్దం చేయాలి. అదికూడా యుద్దప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.



# వ తెలంగాణ పోలీస్ గేమ్స్ - స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటిన సైబరాబాద్ పోలీసులు

- 37 పతకాలతో రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన సైబరాబాద్ పోలీసులు(క్లస్టర్--ఏ)
- క్రీడలు ఒత్తిడిని తగ్గించి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడతాయి
- విజేతలను ఘనంగా సత్కరించిన సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్































**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో జూలై 10 (పీపుల్స్ న్యూస్) :** క్రీడలు ఒత్తిడిని తగ్గించి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడతాయని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ తెలిపారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జూలై 8, 9 తేదీల్లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్--2026లో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన క్లస్టర్--ఏ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబర్చి మొత్తం 37 పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆడిటోరియంలో పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేశారు. ఈ క్రీడా పోటీల్లో సైబరాబాద్ పోలీసులు 9 స్వర్ణ పతకాలు, 8 రజత పతకాలు, 20 కాంస్య పతకాలు సాధించి మొత్తం 37 పతక ఈవెంట్లలో విజయం నమోదు చేశారు. యోగా, ఆర్మ్ రెజ్లింగ్, వుషు, తైక్వాండో, బాక్సింగ్, కరాటే, జిమ్నాస్టిక్స్, పెన్‌చక్ సిలాట్, పవర్‌లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ తదితర వ్యక్తిగత, జట్టు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ విధుల నిర్వహిస్తూనే పరిమిత సమయంలో సాధన చేసి ఇంతటి విజయాన్ని సాధించడం అభినందనీయమని అన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని అన్ని క్రీడల్లోనూ కొనసాగించి సైబరాబాద్ పోలీసుల కీర్తి పతాకాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, క్రీడా సామగ్రి, ఇతర సౌకర్యాల కల్పనకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పోలీస్ ఉద్యోగంలో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి పోలీసు ఉద్యోగి ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. ప్రస్తుతం పతకాలు సాధించిన క్రీడాకారులు మరెందరికో స్ఫూర్తిగా నిలిచి కొత్త ప్రతిభను వెలికితీయాలని అన్నారు. క్రీడలు వ్యక్తులనే కాదు, దేశాల మధ్య కూడా స్నేహం, ఐక్యత, పరస్పర అవగాహనను పెంపొందించే గొప్ప వేదిక అని పేర్కొన్నారు. పోలీసు శాఖలో కూడా క్రీడా స్ఫూర్తితో కలిసి పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. తెలంగాణ పోలీస్ గేమ్స్ & స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన అధికారులు, సిబ్బందిని సైబరాబాద్ సీపీ అభినందించారు. వారి కృషి, క్రమశిక్షణ, అంకితభావం ఇతర పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొంటూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో సైబరాబాద్ పోలీసు క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) సన్ ప్రీత్ సింగ్, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ పుష్ప, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ వెర్షన్ మీడియా ప్రచురణకు అనువుగా, వార్తా శైలిలో, పునరుక్తులు తగ్గించి రూపొందించారు

# రామ మందిరం విరాళాల వివాదం.. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ జరపాలి



అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇది కేవలం ఆర్థిక అక్రమం మాత్రమే కాదని, హిందువుల విశ్వాసంపై జరిగిన దాడి అని పేర్కొంది. ఈ అక్రమాలకు పాల్పడిన వారు మహ్మద్ గజనీని కూడా మించిపోయారని తీవ్ర విమర్శలు చేసింది. శుక్రవారం చండీగఢ్‌లో పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ సింగ్ రాజా వారింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేట్ మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ కేవలం కంటి తుడుపు చర్య మాత్రమేనని ఆరోపించారు. ఈ ఘటన హిందువులనే కాకుండా శ్రీరాముడిపై అపారమైన భక్తి, విశ్వాసం కలిగిన కోట్లది మంది మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని, చరిత్రలో ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదని ఆమె అన్నారు.ఇది కేవలం మోసం లేదా కోట్ల రూపాయల దుర్వినియోగం మాత్రమే కాదు. హిందువుల విశ్వాసంపై జరిగిన దాడి. ఈ మొత్తం వ్యవహారాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో సీబీఐతో విచారించాలి అని సుప్రియా శ్రీనేట్ డిమాండ్ చేశారు. సిట్ చేపట్టిన దర్యాప్తు వివరాలను ప్రజలకు వెల్లడించాలని ఆమె కోరారు. చిన్నచిన్న వ్యక్తులనే అరెస్టు చేశారు. అసలు సూత్రధారులను మాత్రం వదిలేశారు అని ఆరోపించారు.రామ మందిర విరాళాలను దుర్వినియోగం చేసిన వారు మహ్మద్ గజనీని కూడా మించిపోయారని వ్యాఖ్యానించిన ఆమె, హిందుత్వానికి తామే సంరక్షకులమని చెప్పుకునే వారే మతానికి అపకీర్తి తెచ్చారని విమర్శించారు. చరిత్ర ప్రకారం మహ్మద్ గజనీ సోమనాథ్ ఆలయంపై దాడి చేసి అక్కడి సంపదను దోచుకెళ్లిన ఆక్రమణదారుడని ఆమె గుర్తు చేశారు. రామ మందిర ట్రస్టులో బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ సభ్యులను నియమించాయి. సిట్ దర్యాప్తు పురోగతిని ఎందుకు వెల్లడించడం లేదు? అసలు పెద్దవారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? అనుమానితులను ఎందుకు ప్రశ్నించడం లేదు? ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనం పాటిస్తున్నారు? అని ఆమె ప్రశ్నించారు.ఈ అంశంపై ప్రధాని మోదీ తన మౌనం వీడాలని సుప్రియా శ్రీనేట్ కోరారు. ఈ అక్రమాలు చాలా కాలంగా జరుగుతున్నా ప్రభుత్వానికి తెలియకపోతే అది ప్రభుత్వ అసమర్థత. తెలిసి కూడా చర్యలు తీసుకోకపోతే ఆ పాపంలో భాగస్వామ్యం ఉన్నట్టే. దేశ ప్రజలు సమాధానాలు కోరుతున్నారు. వారి మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి అని ఆమె అన్నారు.మరో కాంగ్రెస్ సీనియర్ నేత శక్తిసింహ్ గోహిల్ కూడా హర్యానా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అలాగే రామ మందిర ట్రస్టును రద్దు చేయాలని సుప్రియా శ్రీనేట్, శక్తిసింహ్ గోహిల్ ఇద్దరూ కోరారు. ఈ వివాదం మధ్య, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలను సోమవారం ఆమోదించింది.

# హేమాలి శాప విమోచనం నుంచి వ్రత విధానం వరకు- యోగిని ఏకాదశి మహిమ తెలుసా?



హిందూ సంప్రదాయంలో ఏకాదశి తిథికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ రోజు ఉపవాస జాగారాలతో శ్రీ మహా విష్ణువును పూజించడం వల్ల పాపాలు, రోగాల బాధలు తొలగి సకల శుభాలు చేకూరుతాయని విశ్వాసం. ఒక సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లో ప్రతి ఏకాదశి విశిష్టమైనదే! ఈ సందర్భంగా జ్యేష్ఠ బహుళ ఏకాదశి ఎప్పుడు? ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం వల్ల ఎలాంటి ఫలితాలు కలుగుతాయో ఈ కథనంలో తెలుసుకుందాం.

### యోగిని ఏకాదశి

తెలుగు పంచాంగం ప్రకారం జ్యేష్ఠ మాసంలో కృష్ణ పక్షంలో వచ్చే ఏకాదశిని 'యోగిని ఏకాదశి' అంటారు. జులై 10, శుక్రవారం యోగిని ఏకాదశి సందర్భంగా ఈ వ్రతాన్ని ఎలా ఆచరించాలి? పూర్వం ఈ వ్రతాన్ని ఎవరు ఆచరించారు? వ్రతఫలం ఎలా ఉంటుంది? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

### యోగిని ఏకాదశి విశిష్టత

యోగిని ఏకాదశి నాడు విష్ణుమూర్తిని భక్తి శ్రద్ధలతో పూజించి, ఉపవాసం ఉండడం వల్ల కుష్టు వ్యాధి వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా తొలగిపోతాయని నమ్ముతారు. ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా 88,000 మంది బ్రాహ్మణులకు అన్నదానం చేసినంతటి పుణ్యఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. పూర్వం హేమాలి అనే గంధర్వుడు ఈ వ్రతాన్ని ఆచరించి భయంకరమైన కుష్టు వ్యాధి నుంచి ఉపశమనం పొందినట్లు మహాభారతంలో ధర్మరాజుకు శ్రీకృష్ణుడు వివరించినట్లుగా తెలుస్తోంది. మహిమాన్వితమైన ఈ యోగిని ఏకాదశి గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

### హేమాలి వృత్తాంతం

మహాభారతం ప్రకారం శ్రీకృష్ణుడు ధర్మరాజుకు యోగిని ఏకాదశి ప్రాముఖ్యతను వివరిస్తూ హేమాలి వృత్తాంతం గురించి వివరించిన ఉదంతాన్ని ఇప్పుడు ప్రస్తావించుకుందాం. అలకాపురిని పరిపాలించే కుబేరుడు పరమ శివ భక్తుడు. కుబేరుని శివపూజ కోసం ఆయన సేవకుడు హేమాలి రోజూ మానస సరోవరం నుంచి అరుదైన దేవతా పుష్పాలను తీసుకొస్తూ ఉండేవాడట! ఒకరోజు హేమాలి తన భార్యతో కలిసి విహరిస్తూ కుబేరుని పూజకు పూలు తీసుకుని రావడం మర్చిపోయాడంట! దాంతో కుబేరుడు భగవంతుని పూజ పట్ల హేమాలి నిర్లక్ష్యానికి ఆగ్రహించి భార్యకు దూరమై కుష్టు వ్యాధిగ్రస్థుడుగా పడిఉండమని శపించాడట.

### భూలోకానికి చేరిన హేమాలి

కుబేరుని శాపంతో కుష్టు వ్యాధి సోకిన హేమాలి భార్యకు దూరమై భూలోకానికి చేరుకుంటాడు. అక్కడ తపస్సు చేసుకుంటున్న మార్కండేయ మహర్షిని చూసి హేమాలి ఆయనతో తన శాపాన్ని గురించి వివరించి పశ్చాత్తాపం చెంది తరుణోపాయం సూచించమని ప్రాధేయపడతాడు.
యోగిని ఏకాదశి వ్రత మహిమను తెలిపిన మార్కండేయ మహర్షిహేమాలి ప్రార్థనకు కరుణించిన మార్కండేయ మహర్షి యోగిని ఏకాదశి విశిష్టతను హేమాలికి తెలిపి అతనిచే ఈ వ్రతాన్ని ఆచరింపజేస్తాడు.

### స్వర్గం చేరుకున్న హేమాలి

మార్కండేయ మహర్షి సూచన మేరకు హేమాలి భక్తిశ్రద్ధలతో యోగిని ఏకాదశి వ్రతాన్ని ఆచరించి శాపవిమోచనం పొంది స్వర్గానికి తిరిగి చేరుకుంటాడు. వనవాస సమయంలో అష్టకష్టాలు పడుతున్న ధర్మరాజుతో శ్రీకృష్ణుడు యోగిని ఏకాదశి వ్రతం గురించి వివరించినట్లుగా మహాభారతంలో వివరించి ఉంది. ఈ సందర్భంగా అసలు యోగిని ఏకాదశి వ్రతాన్ని ఎలా ఆచరించాలో చూద్దాం.

### యోగిని ఏకాదశి వ్రత విధానం

యోగిని ఏకాదశి రోజు సూర్యోదయం తోనే నిద్రలేచి స్నానాది కార్యక్రమాలు ముగించుకుని శ్రీమహావిష్ణువును భక్తితో "స్వామి! కేశవా! నీ ప్రసన్నత కోసం నేను ఈ రోజు ఉపవాసం, జాగారం చేస్తాను" అని మనసులో స్మరిస్తూ సంకల్ప దీక్ష స్వీకరించాలి. పూజామందిరంలో ఆవునేతితో దీపారాధన చేయాలి. ఈ రోజు శ్రీమహావిష్ణువును పంచామృతాలతో అభిషేకించి, తులసి దళాలతో, పసుపు రంగు పూలతో పూజించాలి. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ విధిగా చేయాలి. ఈ రోజు విష్ణుమూర్తికి పాయసం నైవేద్యంగా సమర్పించాలి. అలాగే కొబ్బరికాయ, అరటిపండ్లు కూడా స్వామికి నివేదించాలి. అనంతరం యోగిని ఏకాదశి వ్రతకథను చదువుకోవాలి.

### ఆలయ దర్శనం

ఇంట్లో పూజ పూర్తయ్యాక సమీపంలోని విష్ణువు ఆలయానికి వెళ్లి శ్రీ మహా విష్ణువుకు తులసిమాల సమర్పించాలి. ఈ రోజు రాత్రంతా శ్రీ మహా విష్ణువు కీర్తనలు, భజనలు పాడుకుంటూ జాగారం చేయాలి.

### తులసి పూజ

యోగిని ఏకాదశి రోజు సాయంత్రం తులసిని ఓ పీఠంపై పెట్టి నెయ్యి దీపాన్ని వెలిగించి 11 సార్లు ప్రదక్షిణలు చేస్తే కష్టాలు తొలగి సంపద పెరుగుతుందని చెబుతారు.

### ఈ దానాలు శ్రేష్ఠం

పురాణాల ప్రకారం యోగిని ఏకాదశి రోజున పూజలతో పాటు దానధర్మాలకు విశేష ప్రాధాన్యత ఉంది. పవిత్రమైన ఈ రోజున దానాలు చేసే వారిని శ్రీహరి అనుగ్రహిస్తారు. పద్మపురాణంలో పేర్కొన్న ప్రకారం, ఈ రోజున అన్నదానం, సువర్ణదానం, గోదానం చేయడం వల్ల అనంత పుణ్యం లభిస్తుంది.

### ద్వాదశి పారణ

ఏకాదశి మరుసటి రోజైన ద్వాదశి రోజు సూర్యోదయం తోనే తలారా స్నానం చేసి శ్రీహరిని యధావిధిగా పూజించి షడ్రసోపేతమైన మహా నైవేద్యం సమర్పించాలి. ఒక సద్బ్రాహ్మణునికి భోజనం పెట్టి దక్షిణ తాంబూలాలు సమర్పించి నమస్కరించుకోవాలి. ం భోజనం చేసి ఉపవాసాన్ని విరమించవచ్చు.

### యోగిని ఏకాదశి వ్రత ఫలం

నియమ నిష్టలతో యోగిని ఏకాదశి వ్రతం ఆచరిస్తే జన్మాంతర ఖర్మల వలన సంక్రమించిన దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయి. ఈ జన్మలో తెలిసో తెలియకో చేసిన పాపాలు పరిహారం అవుతాయి. యోగిని ఏకాదశి రోజు మరణించిన తర్వాత మోక్షాన్ని పొందుతారని సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడే వరం ఇచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. రానున్న యోగిని ఏకాదశి రోజు మనం కూడా శ్రీమన్నారాయణుని భక్తి పూజించి సకల శుభాలు పొందుదాం.

జై శ్రీమన్నారాయణ!
ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు

# మటన్ ప్రియులకు అలర్ట్.. మాంసంలోని ఆ భాగాలను తింటే గుండె జబ్బులు తప్పవు.. వైద్యుల షాకింగ్ నివేదిక!




అంతర్జాతీయ వైద్య సంస్థ అయిన క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ నివేదికల ప్రకారం... మటన్‌లోని అన్ని భాగాలలో ఒకే పరిమాణంలో కొవ్వు ఉండదు. మనం కొనుగోలు చేసే భాగాలను బట్టి అందులోని కేలరీలు , సంతృప్త కొవ్వుల శాతం మారుతుంటుంది. చెడు ముక్కలను ఎంచుకోవడం వల్ల అది మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను విపరీతంగా పెంచుతుంది. కాబట్టి మటన్ తినేముందు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏ భాగంలో కొవ్వు , కేలరీలు ఎక్కువగా ఉంటాయి? మాంసాహార ప్రియులు ఎక్కువగా ఇష్టపడే మటన్‌లోని రొమ్ము (దీతీష్మర్), పక్కటెముకలు (=ఱఎం) , మెడ (చీవఛఎ) భాగాలలో కొవ్వు , కేలరీలు అత్యధిక పరిమాణంలో ఉంటాయి. ఈ భాగాలు వండిన తర్వాత తినడానికి చాలా జ్యూసీగా, మృదువుగా , ఎంతో రుచికరంగా ఉన్నప్పటికీ, వీటిలో ఉండే అధిక కొవ్వు పదార్థాలు శరీరంలో ఎల్‌డీఎల్ (ాణూ -- చెడు కొలెస్ట్రాల్) స్థాయిలను చాలా వేగంగా పెంచుతాయి. కాబట్టి గుండె జబ్బులు ఉన్నవారు లేదా బరువు తగ్గాలనుకునే వారు ఈ భాగాలకు దూరంగా ఉండటం మంచిది.ఏ భాగాలు ఆరోగ్యకరమైనవి? మీరు తక్కువ కొవ్వు , ఎక్కువ ప్రోటీన్ పొందాలనుకుంటే మటన్ కొనేటప్పుడు సరైన భాగాలను ఎంచుకోవాలి. మేక వీపు భాగం, కాలు లేదా తొడ మాంసంలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. వైద్య పరిభాషలో దీనిని 'లీన్ మీట్' అంటారు. మీరు బరువు నియంత్రణలో ఉంచుకోవాలన్నా లేదా కొలెస్ట్రాల్, గుండె ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతున్నా కూడా ఈ తొడ లేదా కాలు భాగంలోని ముక్కలను ఎంచుకుని తినడం అత్యంత సురక్షితమైన మార్గం.
గుండెపోటు ప్రమాదం మటన్‌ను పరిమితికి మించి ఎక్కువగా తినడం వల్ల శరీరానికి తీవ్రమైన హాని కలుగుతుంది. మటన్‌లోని సంతృప్త కొవ్వులు రక్తనాళాల లోపలి పొరలలో (ూతీవతీఱవం) కొవ్వు గడ్డలుగా పేరుకుపోయేలా చేస్తాయి. దీనివల్ల కాలక్రమేణా రక్త ప్రసరణకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి, అధిక రక్తపోటు, గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది.
యూరిక్ యాసిడ్ , కీళ్ల నొప్పులు మటన్‌లో 'ప్యూరిన్లు' అనే రసాయన సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో జీర్ణం అయినప్పుడు యూరిక్ యాసిడ్‌గా మారతాయి. రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు మితిమీరితే అది కీళ్ల మధ్యలో స్ఫటికాలుగా మారి తీవ్రమైన కీళ్ల నొప్పులకు (గౌట్ వ్యాధి) కారణమవుతుంది. ఇది మూత్రపిండాలపైన కూడా అదనపు భారాన్ని మోపి కిడ్నీ స్టోన్స్ వంట సమస్యలను తెచ్చిపెడుతుంది.
రోజుకు ఎంత పరిమాణంలో మటన్ తినాలి? ఆరోగ్యంగా ఉండటానికి మటన్ తినే పరిమాణాన్ని అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్య నిపుణుల మార్గదర్శకాల ప్రకారం, ఒక సాధారణ ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు 70 నుండి 100 గ్రాముల కంటే ఎక్కువ మటన్ తీసుకోకూడదు.అలాగే మటన్‌ను వారానికి ఒకటి లేదా గరిష్టంగా రెండు సార్లు మాత్రమే ఆహారంలో భాగం చేసుకోవడం శ్రేయస్కరం. ముఖ్యంగా మటన్‌ను ఎక్కువ నూనె వేసి డీప్ ఫ్రై లేదా వేపుడు లాగా వండుకోవడానికి బదులుగా, తక్కువ నూనెతో సాధారణ కర్రీలాగా లేదా సూప్ (వీబ్‌శీఅ ాశీబజూ) రూపంలో వండుకుని తింటే శరీరానికి పూర్తి పోషకాలు అందుతాయి.

# లగ్జరీ ాఖఎ తయారీ సంస్థ ల్యాండ్ రోవర్ తన 2026 ల్యాండ్ రోవర్ డిఫెండర్‌ను గ్లోబల్ మార్కెట్‌లో విడుదల చేసింది.




ఈ కొత్త మోడల్?లో అనేక డిజైన్ అప్డేట్లు ఉన్నాయి. అంతేకాక, ఇందులో ఇప్పుడు ఫ్లాగ్‌షిప్ మోడళ్ల స్ఫూర్తితో రూపొందించిన కొత్త 'వెర్టెక్స్' (ఎవతీవఞ) వేరియంట్ వచ్చింది. అదనంగా, విస్తృత శ్రేణి ఫ్యాక్టరీ-ఫిటెడ్ యాక్సెసరీలను అందిస్తున్నారు. ఈ అప్‌డేట్‌లు పూర్తిగా కొత్తవి కాకపోయినా, ప్రస్తుత మోడల్‌కు మెరుగైన వెర్షన్‌గా ఉంటాయి. ఈ ప్రజాదరణ పొందిన ాఖఎని మరింత ప్రీమియంగా, ప్రత్యేకంగా తీర్చిద్దడమే వీటి ప్రధాన లక్ష్యం.
ల్యాండ్ రోవర్ ప్రవేశపెట్టిన ఈ తాజా అప్‌డేట్‌లలో అత్యంత కీలకమైన విశేషం దీని 'డిఫెండర్ వెర్టెక్స్' వేరియంట్. వాహన రంగంలో లగ్జరీ, ప్రీమియం ఫీచర్లపై ప్రత్యేకంగా దృష్టి సారించే కస్టమర్లను టార్గెట్ చేస్తూ ఈ సరికొత్త మోడల్‌ను కంపెనీ ప్రవేశపెట్టింది.దీనితో పాటు, ఆఫ్‌రోడింగ్ ప్రియులను ఎంతగానో ఆకట్టుకున్న తన పవర్‌ఫుల్ ఫ్లాగ్‌షిప్ మోడల్ 'డిఫెండర్ ఆక్టా' (ణవటవఅనవతీ ాజూూ) ను కూడా కంపెనీ మరింతగా అప్‌డేట్ చేసింది. అంతేకాకుండా, అడ్వెంచర్ ట్రిప్‌లు లేదా లాంగ్ డ్రైవ్స్ ఇష్టపడే వారి కోసం సరికొత్త అఫీషియల్ యాక్సెసరీస్ బండిల్‌ను పరిచయం చేసింది. డిఫెండర్ పూర్తి లైన్‌అప్‌కు సరిపోయేలా వీటిని ప్రత్యేకంగా రూపొందించారు.కొత్త డిఫెండర్ వెర్టెక్స్ వేరియంట్: ఈ కొత్త 'డిఫెండర్ వెర్టెక్స్?'ను మరింత అగ్రెసివ్ డిజైన్?లో రూపొందించారు. ఇందులో షాడో అట్లాస్ మ్యాట్ ఫినిష్‌తో కూడిన కొత్త ఫ్రంట్, రియర్ బంపర్లు, పెద్ద సైజ్ గ్రిల్ ఉన్నాయి. వీటితో పాటు అప్‌డేటెడ్ ఫాగ్ ల్యాంప్స్, బాడీ కలర్ లోయర్ క్లాడింగ్‌ను కూడా చేర్చారు. ఇవన్నీ ఈ ఎస్‌యూవీకి రోడ్డుపై మరింత పవర్‌ఫుల్ లుక్‌ను అందిస్తాయి.ఇక స్టైలింగ్ గురించి మాట్లాడుకుంటే, ఈ వాహనంలో గ్లోస్ బ్లాక్ రూఫ్ స్పాయిలర్, కాంట్రాస్టింగ్ ఎల్లో బ్రేక్ కాలిపర్?లు, ఎల్లో రియర్ రికవరీ ఐస్, సరికొత్త డిజైన్ చేసిన అలాయ్ వీల్స్ అందించారు. అదనంగా, కొనుగోలుదారులు కొత్త 'ఎక్స్‌టెండెడ్ ఎక్స్‌టీరియర్ ప్యాక్'ను కూడా ఎంచుకోవచ్చు. ఇది డిఫెండర్ శ-డైనమిక్, ఎ8 లోని కొన్ని సెలెక్టెడ్ వేరియంట్లలో అనేక 'వెర్టెక్స్' స్టైలింగ్ ఎలిమెంట్స్‌ను అందిస్తుంది.
లైన్‌అప్‌లోకి 6-సీటర్ డిఫెండర్ 110: మరో కీలక అప్డేట్ ఏంటంటే, ల్యాండ్ రోవర్ డిఫెండర్ 110 శ్రేణిలో కొత్త 6-సీట్ల కాన్ఫిగరేషన్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల ఈ ాఖఎ ఇకపై 2о2о2 సీటింగ్ లేఅవుట్‌తో లభించనుంది. ఇందులో భాగంగా రెండవ వరుసలో విడివిడిగా ప్రత్యేకమైన క్యాప్టెన్ సీట్లను (ఝుజ్ఖఱఅ ాఘ్ఞం) ఏర్పాటు చేశారు.ఈ కొత్త సీట్లలో మెరుగైన సపోర్ట్ (బోల్స్టరింగ్), ఆర్మ్‌రెస్ట్‌లు, మ్యాన్యువల్ రిక్లైన్ ఫీచర్లను అందించారు. దీంతో ప్రయాణికులు మూడవ వరుసలోకి సులభంగా వెళ్లే వీలుంటుంది. ఈ సరికొత్త సీటింగ్ అరేంజ్‌మెంట్ వల్ల రెండవ వరుస సీట్ల మధ్య అదనపు స్టోరేజ్ స్పేస్ లభిస్తుంది. ఫలితంగా డిఫెండర్ వాహనం ఫ్యామిలీతో ప్రయాణించే వారికి మరింత సౌకర్యవంతంగా మారింది.
సరికొత్త కలర్ ఆప్షన్లు, యాక్సెసరీలు: 2026 డిఫెండర్ శ్రేణిలో కంపెనీ సరికొత్త 'సర్గస్సో బ్లూ' (ఝతీస్తుంంశీ దీశ్రీబవ) ఎక్స్‌టీరియర్ పెయింట్ ఆప్షన్‌ను జోడించింది. అదే సమయంలో డిఫెండర్ ఆక్టా (ణవటవఅనవతీ ాజూూ) వేరియంట్‌లో 'టెక్స్చర్డ్ గ్రాఫైట్' (్వఞ్బతీవఅ +ఝజూష్ట్రఱవ) ఫినిష్‌తో కూడిన సరికొత్త పెయింట్ స్కీమ్‌ను పరిచయం చేసింది. ఇవే కాకుండా ల్యాండ్ రోవర్ సంస్థ ఫ్యాక్టరీ-ఫిటెడ్ యాక్సెసరీల జాబితాను కూడా మరింత పెంచింది. అడ్వెంచర్ ట్రిప్‌లు లేదా సుదీర్ఘ ప్రయాణాల కోసం ఇందులో ప్రత్యేక ఎక్విప్‌మెంట్‌ను చేర్చారు.
జ్ సొల్యూషన్స్, సైడ్-మౌంటెడ్ గేర్ క్యారియర్, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కంప్రెసర్ కంపాటబిలిటీ, ఎక్స్‌టీరియర్ స్టైలింగ్ కోసం అదనపు ప్యాకేజీలు ఉన్నాయి. వాహనం అప్డేటెడ్ డిజైన్‌కు అనుగుణంగా అనేక యాక్సెసరీలను ఇప్పుడు డార్కర్ ఫినిష్ (ఝతీఎవతీ ఖీఱఅఱంష్ట్ర)లో కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.ల్యాండ్ రోవర్ డిఫెండర్ పవర్‌ట్రెయిన్: ల్యాండ్ రోవర్ డిఫెండర్ పవర్‌ట్రెయిన్ విషయానికొస్తే, 2026 అప్‌డేట్‌లో భాగంగా ఈ వాహనంలో డిజైన్, వినియోగ సౌలభ్యం, వ్యక్తిగతీకరణకు సంబంధించిన మార్పులు మాత్రమే చేశారు. అయితే ఇప్పుడు సరికొత్త కఠినమైన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా దీని ఇంజిన్‌లో కొన్ని చిన్నపాటి మార్పులు చేశారు.
ఈ అప్‌డేట్?తో దీని 'ఆక్టా' (ాఘ్ఝ) వేరియంట్ ఇంజిన్ పవర్ అవుట్‌పుట్ 626 ఎష్ట్రజూ నుంచి 533 ఎష్ట్రజూకి తగ్గింది. అదనంగా, డిఫెండర్ లైన్‌అప్‌లోకి సరికొత్త ా380 3.0-లీటర్ మైల్డ్-హైబ్రిడ్ పెట్రోల్ ఇంజిన్‌ను కూడా చేర్చారు. ఇది గరిష్ఠంగా 375 ఎష్ట్రజూ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది.

# "మైక్రో హ్యాబిట్స్" ట్రై చేస్తారా? - ఆరోగ్యకరమైన జీవనశైలికి హెల్ప్ అవుతాయట!



మనం ఒకే రోజులో కొండను తవ్వలేం కానీ, రోజూ ఒక చిన్న రాయిని తీసి పక్కన పడేయవచ్చు కదా. మైక్రో హ్యాబిట్స్ కూడా సరిగ్గా ఇదే చేస్తాయి. దీనివల్ల వచ్చే ఫలితాలు కూడా అలాగే ఉంటాయట. ఈ చిన్న అలవాట్లే భవిష్యత్తులో పెద్ద లక్ష్యాలను సాధించడానికి తోడ్పడతాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి, దీర్ఘకాలిక లక్ష్య సాధనకు ఇవి ప్రేరణగా నిలుస్తాయట. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!
ఉదయం నిద్రలేవగానే బెడ్ సర్దుకోవడం : చాలామంది దీనిని ఒక చిన్న పనిగా భావిస్తారు. కానీ, ఇది మెదడుపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తుందంటున్నారు నిపుణులు. నిద్ర లేచిన వెంటనే బెడ్?ను నీట్?గా సర్దడం వల్ల, రోజు ప్రారంభంలోనే ఒక పనిని విజయవంతంగా పూర్తి చేశారనే భావన కలుగుతుందని చెబుతున్నారు. ఇది మెదడుకు ఒక పాజిటివ్ సిగ్నల్?ను పంపి, రోజంతా మిగిలిన పనులను కూడా క్రమశిక్షణతో పూర్తి చేయడానికి ఉత్సాహాన్ని ఇస్తుందని పేర్కొంటున్నారు.
కళ్ల కింద డార్క్? సర్కిల్స్? వచ్చాయా? - ఈ టిప్స్ పాటిస్తే బెటర్ అంటున్న ఎక్స్?పర్ట్స్?!
వ్యాయామం : పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా ఎవరికైనా ఆరోగ్యం ఎంతో అవసరం. కొందరైతే గంట వ్యాయామం చేయాలని తీర్మానించుకుంటారు. కానీ, రెండు రోజులు చేసి మూడో రోజు ఆపేస్తారు. ఇలాంటప్పుడు తక్కువ సమయంలో 10 నిమిషాల పాటు నడవడం అలవాటు చేసుకోవాలంటున్నారు నిపుణులు. ఆ తర్వాత మెల్లగా సమయాన్ని పెంచుకుంటూ వెళ్లొచ్చని సూచిస్తున్నారు.
మంచినీళ్లు : మనలో చాలా మంది మంచినీళు తాగడాన్నీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్త ఆకలిగా అనిపించగానే ఏదైనా తినాలని అనుకుంటారు. కానీ, నీళ్లు తాగాలని మాత్రం ఆలోచించరు. అలాగే, కాఫీ/టీ, కూల్?డ్రింకులు తాగాలనిపించినప్పుడు నీళ్లు తాగుతుండాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో మిగతా పానీయాలను నియంత్రించడంతో పాటు సరిపడినన్ని నీళ్లు తీసుకోవచ్చని సలహా ఇస్తున్నారు. అలాగే ఏకాగ్రత కుదరనప్పుడు, అలసటగా, చిరాగ్గా అనిపించినప్పుడు కాసిన్ని నీళ్లు తాగితే మంచిదని పేర్కొంటున్నారు.
ఎక్కువసేపు కూర్చుని పనిచేసేటప్పుడు : ఆఫీస్ పనిలో లేదా చదువులో పడి నీళ్లు తాగితే మంచిదని పేర్కొంటున్నారు.
గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల వెన్నునొప్పి, మెడనొప్పి, బద్ధకం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గంటకు ఒకసారి కాసేపు నడవడం మంచిదని సూచిస్తున్నారు. లేకుంటే చేతులను పైకి చాచడం, మెడను తిప్పడం లేదా కాస్త ముందుకు వంగడం వంటి సాధారణ స్ట్రెచింగ్స్ చేయాలని సలహా ఇస్తున్నారు. ఇది శరీరంలో రక్తప్రసరణను పెంచి, అలసటను దూరం చేస్తుందంటున్నారు. ఏకాగ్రత కూడా పెరుగుతుందని తెలియజేస్తున్నారురాత్రి పడుకునే ముందు : చాలామంది ఉదయం లేవగానే ఈ రోజు ఏం చేయాలి అని ఆలోచిస్తూ, సమయాన్ని వృథా చేస్తుంటారు. అందుకే, పడుకునే ముందు ఒక డైరీ లేదా పేపర్ తీసుకుని, రేపు ఏం చేయాలి లేదా పూర్తి చేయాల్సిన పనుల గురించి రాయాలంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల మెదడులోని ఒత్తిడి తగ్గి, రాత్రి ప్రశాంతంగా నిద్ర ఎని చెబుతున్నారు. మరుసటి రోజు ఉదయం ఏం చేయాలనే స్పష్టత ఉంటుందని సూచిస్తున్నారు.

## పక్కా స్కెచ్...

# పక్కనుండే భూమి మాయం

- గచ్చిబౌలి ప్రభుత్వ భూమిలో క్లారిన్ హోటల్.

**సహకరించిన అధికారులు..!**

- కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి కనుమరుగు.
- సర్వేనెంబర్ 108 , 110, లో 3751 గజాలు మాయం.
- ఫేక్ డాక్యుమెంట్ లతో యు ఎల్ సి పత్రాలు తయారు




**శేర్లింగంపల్లి : జూలై 10 (పీపుల్స్ న్యూస్)**
ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన ప్రభుత్వ అధికారులే... అక్రమార్జనకు కక్కుర్తి పడి ఓ భారీ స్కెచ్ కు తెర తీశారు. ఒకవైపు లక్షలలో వేతనాలు తీసుకుంటున్నప్పటికీ... కొందరు కబ్జారాయులకు ప్రత్యక్షంగా సహకరిస్తూ.. కోట్లు కూడబెట్టుకుంటున్న ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్లో ఈ పక్క స్కెచ్ అమలు చేశారు. ఓ నిర్మాణదారుడు అతని ప్రైవేట్ స్థలమైన సర్వేనెంబర్ 111 లో సుమారు 1250 గజాల స్థలం ఉంది. ఇందులో సదరు వ్యక్తి భారీ నిర్మాణాలు చేసేందుకు టౌన్ ప్లానింగ్ నుండి సెల్లార్, స్టిల్ట్, ఐదు అంతస్తుల నిర్మాణానికి అనుమతి తీసుకున్నాడు. ఇక్కడే అతనికి ఒక వక్రపు బుద్ధి కలిగింది. దీని పక్కనే ఉండే సర్వే నంబర్ 108, 110 ప్రభుత్వ స్థలంపై కబ్జా రాయుడి కన్ను పడింది. దీంతో వెంటనే అతని పలుకుబడి ఉపయోగించి టౌన్ ప్లానింగ్, మున్సిపల్ సిబ్బందిని కలిసి ఆయన వేసుకున్న ప్రణాళికను అధికారులకు వివరించాడు. దీంతో అధికారులు అందుకు సానుకూలంగా స్పందించి తమకు కావలసింది... లంచమేనంటూ సదరు వ్యక్తికి చెప్పడంతో.. అతనుకు వారి ఇచ్చిన ప్లాన్ ను పక్కాగా పాటించాడు.




**సైబరాబాద్ అంటేనే కాస్ట్లీ..!**
అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో సైబరాబాద్ ప్రాంతం ముందు వరుసలో ఉంది. ఇటీవల సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గా అవతరించిన తర్వాత సైబరాబాద్ ప్రాంతం విలువ మరింత పెరిగింది. దీనినే ఆసరాగా మలచుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జారాయుడుతో కుమ్మక్కై కోట్లు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 108, 110 లో ఉన్న 3751 గజాల స్థలాన్ని కొట్టేసేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలోనే ఇందులో భాగంగానే అతని ప్రైవేట్ స్థలంలో తీసుకున్న నిర్మాణ అనుమతులతో ప్రభుత్వ స్థలంలో ఉన్న 37 51 గజాల స్థలాన్ని సైతం కబ్జా చేసి ఏకంగా నిర్మాణాలు చేశారు. ఇందులో భారీ నిర్మాణాలను నిర్మించి ఓ భారీ క్లారియన్ ఇంటర్నేషనల్ హోటల్ పేరుతో రెడీ అయింది. పేదోడు గుడిసె వేసుకుంటే ఉరుకులు పరుగులతో దిగిపోయే హైడ్రా.. టౌన్ ప్లానింగ్ అధికారులు మరి ఇంత పెద్ద ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు.






**5001 గజాలకు రెగ్యులరైజా..!**
ప్రభుత్వ భూమిని ఆక్రమించి భారీ హోటల్ నిర్మించిన కబ్జారాయుళ్లు ఈ స్థలం మొత్తానికి జీవో-59 నిబంధనలను అడ్డుపెట్టుకుని రెగ్యులర్ చేయించుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మొత్తం 5,001 గజాల స్థలానికి సంబంధించి ప్రభుత్వానికి సుమారు రూ.70 లక్షల రుసుము చెల్లించి జీవో-59 కింద రెగ్యులరైజేషన్ పొందేందుకు ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. మరి అధికారుల అనుమతి లేకుండా రుసుము ఎలా చెల్లించే విసులుబాటు దొరికిందని ప్రజలు విమర్శిస్తున్నారు."పేదవాడికో లెక్క.. పెద్దోడికో లెక్కనా?" అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. చిన్న స్థలాల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ, కార్పోరేట్ సంస్థలకు మాత్రం.. రెడ్ కార్పెట్ వేస్తున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, రెవెన్యూ శాఖ, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జీవో-59 నిబంధనలు ఎవరికి వర్తిస్తాయి? ప్రభుత్వ భూముల విషయంలో వాటి అమలు ఎలా జరుగుతోంది? అనే అంశాలపై అధికారిక వివరణ ఇవ్వాలని ప్రజలకు ఇచ్చి అనంతరం ప్రభుత్వ స్థలంలో నిర్మించిన హోటల్ ను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



Grand Opening
11 July 2026
On Saturday
At 4:00 P.M
Mr. Kuna Srisailam Goud Garu
(Ex. MLA Quthbullapur)
Mr. Alhaj Syed Jahangir Hussain Sahab
(All India State Dalit Sena Minority President & Congress Party Senior Leader Quthbullapur)
F.Z. Poultry
Cell : 9030020670
FZ
MEAT MART
SUGUNA Chicken
Younger Tender Better
WHOLESALE & RETAIL
HALAL 100%
WE UNDERTAKE ALL TYPES OF
FUNCTION ORDERS & HOTEL SUPPLY



# టీమిండియాపై బీసీసీఐ సీరియస్..

ఇంగ్లండ్ పర్యటనలో వరుసగా మూడు టీ20 మ్యాచ్‌ల్లో ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు కోచింగ్ స్టాఫ్‌పై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టీ20 సిరీస్‌లో జట్టు కనబరిచిన నిరాశాజనక ప్రదర్శనపై బీసీసీఐ కోచింగ్ స్టాఫ్, ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా సమీక్షించనుంది. నిజానికి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కాంట్రాక్ట్ 2027 వరకు ఉన్నప్పటికీ, జట్టు ఇటీవలి పేలవమైన ఆటతీరుతో ఆయన పదవికే ముప్పు పొంచి ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమిండియా బ్యాక్-టు-బ్యాక్ రెండు టీ20 సిరీస్‌లను కోల్పోయింది. మొదట ఐర్లాండ్ చేతిలో 2-0తో వైట్‌వాష్ అయిన భారత జట్టు, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ 3-0తో వెనుకబడి సిరీస్‌ను చేజార్చుకుంది. భారత్-ఇంగ్లండ్ మధ్య ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు జరగ్గా.. అందులో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ పర్యటనలో మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాల వల్లే బీసీసీఐ ఈ సమీక్షకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌ను జట్టు నుండి తప్పించడంపై మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరిగిన మొదటి టీ20 తర్వాత శాంసన్‌ను పక్కన పెట్టారు. అతని స్థానంలో వైభవ్ సూర్యవంశీని ఓపెనర్‌గా బరిలోకి దించినప్పటికీ, అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మరోవైపు ఇషాన్ కిషన్, తిలక్ వర్మల ఫామ్ కూడా టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారింది. ఐర్లాండ్ సిరీస్‌తో కలుపుకొని ఈ మొత్తం పర్యటనలో తిలక్ వర్మ బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. అయితే, వరుసగా ఫెయిల్ అవుతున్నప్పటికీ కేవలం వైస్ కెప్టెన్ (ఉప-కెప్టెన్) అనే ఒకే ఒక్క కారణంతోనే తిలక్ వర్మను జట్టు నుండి తప్పించడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేయర్‌గా ఉన్న ఇషాన్ కిషన్ సైతం ఇంగ్లండ్‌లోని పిచ్‌ల స్వింగ్, బౌన్స్‌ను తట్టుకోలేక పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

# ఆఖరి టీ20కి భారత జట్టులో భారీ మార్పులు

## రీఎంట్రీ ఇవ్వనున్న సంజూ శాంసన్

ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాలతో సిరీస్ కోల్పోయిన టీమిండియా నామమాత్రపు ఆఖరి టీ20కి సిద్ధమైంది. శనివారం సౌతాంప్టన్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగుతోంది. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు ఈ మ్యాచ్ కూడా గెలిచి అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఇంగ్లండ్ ఉంది. నాలుగో టీ20 విజయానంతరం ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఇదే విషయాన్ని తెలియజేశాడు. టీ20ల్లో అగ్రస్థానాన్ని అందుకోవడమే తమ లక్ష్యమని చెప్పాడు. దాంతో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. పేలవ బ్యాటింగ్, చెత్త బౌలింగ్‌తో వరుస పరాజయాలను మూటగట్టుకున్న టీమిండియా.. ఆఖరి మ్యాచ్‌లో భారీ మార్పులు చేసే అవకాశం ఉంది. సంజూ శాంసన్ స్థానంలో వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడి తీవ్రంగా నిరాశపర్చిన వైభవ్‌ను పక్కనపెట్టవచ్చు. లేదంటే అతన్ని కొనసాగించి ఇషాన్ కిషన్‌పై వేటు వేసి సంజూ శాంసన్‌ను ఫస్ట్ డౌన్‌లో ఆడించవచ్చు. ఏది ఏమైనా సంజూ శాంసన్ రీఎంట్రీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. అవసరమైతే అభిషేక్ శర్మకే రెస్ట్ ఇవ్వవచ్చు. ఇషాన్ కిషన్ కూడా ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. ఐర్లాండ్‌తో రెండు టీ20ల్లో 1, 12 పరుగులు చేసిన ఇషాన్.. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో వరుసగా 0, 49, 13,



4 పరుగులు చేసి తీవ్రంగా నిరాశపర్చాడు. రెండో టీ20లో 49 పరుగులు చేసినా స్లోగా బ్యాటింగ్ చేసి విమర్శలపాలయ్యాడు. శివమ్ దూబే కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. అతన్ని తప్పించాలనుకుంటే యువ ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్జే తుది జట్టులోకి వస్తాడు. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ కూడా దారుణంగా విఫలమయ్యాడు. టాపార్డర్‌ను కొనసాగించాలనుకుంటే సంజూ శాంసన్ కోసం తిలక్‌పై వేటు వేయవచ్చు. లేదంటే శివమ్ దూబేను కొనసాగించి సూర్యాన్ష్ కోసం తిలక్‌ను తప్పించవచ్చు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తిలక్ వర్మ వరుసగా 13, 24, 3, 11 పరుగులే చేశాడు. ఇప్పటికే అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్షర్ పటేల్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా కొనసాగనుండగా.. వరుణ్ చక్రవర్తి గాయం నుంచి కోలుకుంటే బరిలోకి దిగుతాడు. లేదంటే వాషింగ్టన్ సుందర్ జట్టులో కొనసాగుతాడు. పేస్ బౌలర్లుగా ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ బరిలోకి దిగనున్నారు. హర్షిత్ రాణా కోలుకుంటే ప్రసిధ్ కృష్ణపై వేటు పడనుంది. ఇంగ్లండ్‌తో ఆఖరి టీ20కి భారత తుది జట్టు(అంచనా) వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్/ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, తిలక్ వర్మ/సూర్యాన్ష్ షెడ్జే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్/వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా/ప్రసిధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.

# బిగ్‌బాష్ లీగ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న చెన్నై నగరం



ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రారంభం కానున్న బిగ్ బాష్ లీగ్ (2026-27 సీజన్) ప్రారంభ మ్యాచ్‌కు భారతదేశంలోని చెన్నై నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. తద్వారా భారత్‌లో ఒక మ్యాచ్‌ను నిర్వహించబోతున్న తొలి విదేశీ క్రికెట్ లీగ్‌గా బిగ్ బాష్ లీగ్ రికార్డు నెలకొల్పనుంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం ఈ చరిత్రాత్మక ప్రకటనను అధికారికంగా వెల్లడించారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఐకానిక్ 'ఎమ్ఏ చిదంబరం స్టేడియం' (చేపాక్) లో జరిగే ఈ ఓపెనింగ్ మ్యాచ్‌లో మెల్బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్లు తలపడనున్నాయి. డిసెంబర్ నెలలో భారతదేశం అంతటా జరగనున్న వారం రోజుల పాటు సాగే ఆస్ట్రేలియా సాంస్కృతిక, వ్యాపార, క్రీడా ఉత్సవం 'జీ డే నమస్తే'లో ఈ బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ ఒక ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య క్రీడలు, సాంకేతికత, పెట్టుబడులను పెంపొందించేందుకు కుదిరిన 'సహకార రోడ్‌మ్యాప్' లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. "భారతదేశం అంతటా, ముఖ్యంగా చెన్నైలో అద్భుతమైన క్రికెట్ ప్రేమికులు ఉన్నారు. చేపాక్ స్టేడియంలో మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు వస్తారని మేము ఆశిస్తున్నాము" అని బిగ్ బాష్ లీగ్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ అలిస్టర్ డోబ్సన్ సంతోషం వ్యక్తం చేశారు.

# వైభవ్ సూర్యవంశీకి చాలా అద్భుతమైన భవిష్యత్తు ఉంది

## • సూర్యవంశీ వైఫల్యంపై ధోనీ సంచలన వ్యాఖ్యలు

భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ, ప్రస్తుత సంచలన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఇద్దరూ బీహార్ రాష్ట్రానికి చెందినవారే. ఒకరు ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తే, మరొకరు 15 ఏళ్ల ప్రాయంలోనే ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో వైభవ్ వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న వేళ, అతని ఆటతీరుపై ధోనీ తొలిసారి స్పందించారు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరఫున ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్ పర్యటన పెద్దగా కలిసిరావడం లేదు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్, ఇక్కడి పిచ్‌లపై పరుగులు సాధించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో కేవలం 14 సగటుతో 42 పరుగులు మాత్రమే చేయగలిగాడు. శ్రీలంకలో జరిగిన త్రైపాక్షిక సిరీస్‌లో 200 పైగా స్ట్రైక్ రేట్‌తో, కేవలం 29 బంతుల్లో 94 పరుగులు చేసి రికార్డులు సృష్టించిన ఈ యువ ఆటగాడి ఫామ్ ఒక్కసారిగా పడిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. క్రికెట్ ప్రపంచంలో వైభవ్ ప్రదర్శనపై చర్చ జరుగుతున్న వేళ, ధోనీ పుట్టినరోజు సందర్భంగా క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్ ఆయనను కలిశారు. ఒకే రాష్ట్రానికి చెందిన వైభవ్‌ను ఎప్పుడైనా కలిశారా అని ప్రశ్నించగా ధోనీ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. తామిద్దరం అధికారికంగా ఎప్పుడూ కలుసుకోలేదని, కానీ ఒకసారి అనుకోకుండా ఒకరినొకరు దాటుకుంటూ వెళ్లామని, మాట్లాడుకునే అవకాశం రాలేదని ధోనీ స్పష్టం చేశారు. అయితే వైభవ్ ఆటపై స్పందిస్తూ.. "వైభవ్ సూర్యవంశీకి చాలా అద్భుతమైన భవిష్యత్తు ఉంది. ప్రపంచమంతా అతని ఆటను గమనిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించగల అద్భుతమైన నైపుణ్యం ఆ కుర్రాడిలో ఉంది" అంటూ ధోనీ కొనియాడారు. వరుస వైఫల్యాలతో ఇబ్బంది పడుతున్న యువ ఆటగాడికి ధోనీ ఇచ్చిన ఈ మద్దతు పెద్ద ఊరటనిస్తుందనడంలో సందేహం లేదు. భారతదేశంలోని ఫ్లాట్ పిచ్‌లపై అలవోకగా సిక్సర్లు బాదిన వైభవ్‌కు ఇంగ్లాండ్ పిచ్‌లపై ఉన్న అదనపు బౌన్స్ పెద్ద శాపంగా మారింది. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ల వేగాన్ని, పిచ్ నుంచి ఊహించని విధంగా వస్తున్న బౌన్స్‌ను ఎదుర్కోవడంలో వైభవ్ పొరపాట్లు చేస్తున్నాడు. షార్ట్ పిచ్ బంతులను సరిగ్గా అంచనా వేయలేక చెత్త షాట్లకు యత్నిస్తూ వికెట్ పారేసుకుంటున్నాడు. అయితే ఈ ఇబ్బంది కేవలం వైభవ్‌కు మాత్రమే కాదు, భారత సీనియర్ బ్యాటర్లను



సైతం ఇంగ్లాండ్ బౌలర్లు ముప్పతిప్పలు పెడుతున్నారు. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ సైతం ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఘోరంగా విఫలమయ్యాడు. ఈ సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ మాత్రమే నాలుగు మ్యాచ్‌ల్లో 190 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. అభిషేక్ శర్మ వేగంగా ఆడుతున్నప్పటికీ పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడలేకపోతున్నాడు. ఇషాన్ కిషన్ 4 మ్యాచ్‌ల్లో కేవలం 16.5 సగటుతో 66 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇప్పటికే భారత జట్టు సిరీస్‌ను కోల్పోయినప్పటికీ, జులై 11న సౌతాంప్టన్ వేదికగా జరిగే చివరి మ్యాచ్‌లో టీమ్ మేనేజ్‌మెంట్ వైభవ్‌కు మరో అవకాశం ఇవ్వాలని భావిస్తోంది.

# ఫ్రాన్స్ సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు

## • 2-0 గోల్స్ తేడాతో మొరాకోను మట్టికరిపించిన ఫ్రాన్స్

ఫిఫా వరల్డ్ కప్-2026 సీజన్‌లో ఫ్రాన్స్ జోరు ఏమాత్రం తగ్గడం లేదు. ఫ్రాన్స్ జట్టు మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఉత్కంఠభరితంగా సాగిన నాకౌట్ పోరులో2-0 గోల్స్ తేడాతో మొరాకోను మట్టికరిపించింది. ఈ గెలుపుతో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఈ ఘన విజయంతో ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీఫైనల్‌కు చేరిన జట్టుగా ఫ్రాన్స్ సరికొత్త రికార్డు సృష్టించింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఫ్రాన్స్ మైదానంలో దూకుడును ప్రదర్శించింది. బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆటపై పట్టు సాధించింది. ఈ క్రమంలో గోల్ చేయడానికి 30వ నిమిషంలో ఫ్రాన్స్ ఆశించిన అవకాశం లభించింది. స్టార్ ప్లేయర్ ఎంబాపె మొరాకో డిఫెన్స్‌ను దాటుకుంటూ బాక్స్ లోపలికి దూసుకెళ్లగా, మొరాకో డిఫెండర్ నౌసైర్ మజ్రావోయి అతడిని కిందపడేశాడు. దీనితో రెఫరీ ఫ్రాన్స్‌కు పెనాల్టీని ప్రకటించారు. ఎంబాపె షాట్ కొట్టగా, మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో అద్భుతమైన డైవ్‌తో ఎంబాపె కొట్టిన బంతిని చాలా సులువుగా పట్టుకుని ఫ్రాన్స్ సంబరాలను అడ్డుకున్నాడు. ఫస్టాఫ్ ముగిసే సమయానికి ఇరు జట్ల స్కోరు 0-0తో సమంగా



నిలిచాయి. సెకండాఫ్‌లో మొరాకో జట్టు వ్యూహాత్మకంగా పుంజుకోవడానికి ప్రయత్నించింది. కానీ, ఫ్రాన్స్ ఆ జట్టును నిలువరించింది. మ్యాచ్ 60వ నిమిషంలో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె, బాక్స్ పైభాగం నుంచి బంతిని నెట్ ఫార్ కార్నర్‌లోకి పంపాడు. గోల్‌కీపర్ బోనో ఎంత ప్రయత్నించినా ఆ బంతిని ఆపలేకపోయాడు. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత వేగంగా కదిలింది. మొరాకో జట్టు కోలుకునే లోపే ఉస్మాన్ డెంబెలే మ్యాచ్ మైలురాయిని మార్చేశాడు. దూయే అందించిన పాస్‌ను అందుకున్న డెంబెలే బంతిని నెట్ బాట పట్టించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కు చేరింది. రెండు గోల్స్ వెనుకబడిన మొరాకో మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి తమ స్టార్ ఆటగాళ్లు సోఫియాన్ రహిమి, సోఫియాన్ అమ్రబాత్, జకారియా ఎల్ ఊహాదీలను సబ్‌స్టిట్యూట్‌లుగా రంగంలోకి దించింది. కానీ, ఫలితం లేకుండా పోయింది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో మొరాకో గోల్ కోసం సర్వశక్తులూ ఒడ్డింది. చివరి నిమిషాల్లో ఫ్రాన్స్ తరఫున సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మాతెటా,బార్కోలా జోడి మూడో గోల్ కోసం గట్టి ప్రయత్నం చేసింది. కానీ, అది సాధ్యం కాలేదు. దీంతో 2-0తో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చేసిన గోల్‌తో కెప్టెన్ కిలియన్ ఎంబాపె అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో పలు మైలురాళ్లను అందుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నేరుగా 100 గోల్స్‌లో భాగస్వామ్యాన్ని పంచుకున్న మొదటి ఆటగాడిగా ఎంబాపె నిలిచాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఫ్రాన్స్ తరఫున అతను ఇప్పటివరకు వ్యక్తిగతంగా 64 గోల్స్ చేయడమే చేశాడు. అలాగే, 36 గోల్స్ అసిస్ట్‌లు అందించాడు. దీంతో 100 గోల్స్ మైలురాయిని అందుకున్నాడు. 2018, 2022, 2026 ఎడిషన్లన్నింటిలో కలిపి ఎంబాపె ప్రపంచకప్‌లో తన మొత్తం గోల్స్ సంఖ్యను 20కి పెంచుకున్నాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ (21 గోల్స్) ఆల్-టైమ్ రికార్డుకు ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు.

# స్మృతి మంధాన 'ట్రిపుల్ సెంచరీ'!



టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో 300 మ్యాచ్‌ల మైలురాయి అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ ద్వారా 29 ఏళ్ల స్మృతి మంధాన ఈ ఫీట్ సాధించింది. ఓవరాల్‌గా ఈ ఘనతను అందుకున్న 12వ మహిళా క్రికెటర్‌గా గుర్తింపు పొందింది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఈ రికార్డ్ గురించి మాట్లాడుతూ.. స్మృతి మంధాన సంతోషం వ్యక్తం చేసింది. గత రాత్రే తనకు ఈ రికార్డ్ గురించి తెలిసిందని వెల్లడించింది. లార్డ్స్ వేదికగా 2017 మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఆడిన విషయాన్ని, ఆ కఠిన టోర్నీ తర్వాత తన భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిని గుర్తు చేసుకుంది.'గత రాత్రే నేను 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడబోతున్నాననే విషయం తెలిసింది. ఓ ప్లేయర్‌గా ప్రతీ ఫార్మాట్‌లో ఎన్ని మ్యాచ్‌లు ఆడామనే విషయాన్ని లెక్కించుకోలేం. లార్డ్స్ వేదికగా ఆడిన 2017 ప్రపంచకప్ ఫైనల్ నాకు ఇంకా గుర్తుంది. ఆ ప్రపంచకప్‌లో నేను సరిగ్గా ఆడలేదు. నాకు మళ్లీ టీమిండియా తరఫున ఆడే అవకాశం లభిస్తుందా? అని అప్పుడు అనిపించింది. అలాంటి పరిస్థితుల నుంచి పుంజుకొని ఇప్పుడు లార్డ్స్ మైదానంలో 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడటం కంటే గొప్ప విషయం మరొకటి లేదు. లార్డ్స్ వేదికగానే టీ20 ప్రపంచకప్ సెమీస్ చేరే అవకాశం మాకులభించింది. కానీ ఆ అవకాశాన్ని మేం సద్వినియోగం చేసుకోలేకపోయాం. కానీ ఇది క్రికెట్. ముందుకు సాగాల్సిందే.

# కొత్త కథనంతో వచ్చిన లెనిన్


## అఖిల్ నటనా తీరు అద్భుతం




టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్య, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్య, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాధగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ స్జబెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు.ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్థంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

# షూటింగ్‌ల ఒత్తిడి నుంచి రెస్ట్

## యూరప్ టూర్ వెళ్లనున్న ప్రభాస్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్', హను రాఘవపూడి డైరెక్షన్‌లో వస్తున్న 'ఫౌజీ' చిత్రాలతో పాటు బ్లాక్‌బస్టర్ హిట్స్ 'సలార్', 'కల్కి 2898 ' సీక్వెల్స్ కూడా ఆయన చేతిలో ఉన్నాయి. అయితే.. బ్యాక్ టు బ్యాక్ షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్న ప్రభాస్, త్వరలోనే కాస్త బ్రేక్ తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ హైదరాబాద్‌లో 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. హీరో ప్రభాస్ మరియు హీరోయిన్ త్రిప్తి డిమ్రి పై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇక స్పిరిట్ లేటెస్ట్ షెడ్యూల్ పూర్తయిన వెంటనే ప్రభాస్ ఒక చిన్న విరామం తీసుకోనున్నారు. సుమారు పదిరోజుల పాటు వెకేషన్ కోసం ఆయన యూరప్ వెళ్లనున్నట్లు సమాచారం. యూరప్ టూర్ ముగించుకుని తిరిగొచ్చిన తర్వాత, ప్రభాస్ తన పూర్తి ఫోకస్‌ను 'ఫౌజీ' సినిమాపై పెట్టనున్నట్టుగా తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడిక్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంతో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకోగా.. బ్యాలెన్స్ షూటింగ్‌ను కంప్లీట్ చేసే ఎ÷–లానింగ్‌లో ఉన్నాడు డార్లింగ్. ఆ తర్వాత స్పిరిట్ పూర్తి చేసి.. కల్కి 2 సెట్స్‌లో జాయిన్ అవనున్నాడు. ఇక ఆ తర్వాత సలార్ 2 సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రస్తుతానికి ప్రభాస్ ఈ భారీ లైనప్‌తో బిజీగా ఉన్నాడు. అందుకే.. ఒక స్మాల్ బ్రేక్ తీసుకుంటున్నాడని చెప్పొచ్చు.

## కాజల్ మ్యాజిక్.. సింపుల్ లుక్‌కే సూపర్



టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ గ్లామర్ పరంగానే కాకుండా, నటిగానూ సెకండ్ ఇన్నింగ్స్‌లో దూసుకుపోతోంది. తాజాగా ఈ బ్యూటీ ఐవరీ వైట్ కలర్ స్మాక్డ్ గౌనులో దిగిన క్లాసిక్ ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఎంతో సింపుల్‌గా, అంతే ఈ లుక్‌లో కాజల్ అగర్వాల్ చాలా గ్రేస్‌ఫుల్‌గా కనిపించింది. తన స్టైల్‌తో మరింత ఆకట్టుకుంది. తల్లి అయిన తర్వాత సినిమాలు ఎంపిక చేసుకునే విషయంలో మరింత బాధ్యతగా ఉంటున్నానని ఆమె తాజాగా చెప్పింది.ఆ విశేషాలు చూద్దాం..

దేవకన్యలా మెరిసిన చందమామ: ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'ప్లీట్స్ బై అరుణి' డిజైన్ చేసిన యాంకెల్ లెంత్ వైట్ డ్రెస్‌లో కాజల్ అగర్వాల్ ఎంతో అందంగా కనిపించింది. సెలబ్రిటీ స్టైలిస్ట్ అర్చన మెహతా ఈ లుక్‌ను చాలా రాయల్‌గా ప్లాన్ చేశారు. ఇక ఒక చేతిని తల వెనుకకు పెట్టుకుని, పెదవులపై చిన్న నవ్వుతో కాజల్ ఇచ్చిన పోజులు వింటేజ్ క్లాస్ లుక్‌ను గుర్తుచేస్తున్నాయి. మినిమల్ మేకప్, సింపుల్ ఇయర్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.'ది ఇండియా స్టోరీ'తో కిచెన్‌నే మార్చేసింది: జూలై 24న రిలీజ్ కాబోతున్న 'ది ఇండియా స్టోరీ' సినిమాలో కాజల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో నటించింది. కల్తీ ఆహారం, పెస్టిసైడ్స్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా కోసం చేసిన రీసెర్చ్ తనను షాక్‌కు గురిచేసిందని కాజల్ చెప్పింది. ఇక ఈ సినిమా కథ విన్నాక, తన కొడుకు ఆరోగ్యం కోసం తన సొంత వంటగదిలోని వస్తువులనే మార్చేశానని, మంచి కంటెంట్ ఉన్నందుకే ఈ సినిమా చేశానని వెల్లడించింది.కాజల్ తన కొడుకు నీల్ గురించి చెప్తూ ఆసక్తికరమైన విషయాలు పంచుకుంది. తన కొడుక్కి రామాయణం అంటే పిచ్చని, వాడికి రావణుడంటే ఇష్టమని, అందుకే తను మండోదరి పాత్ర చేస్తున్నట్లు చెప్పగానే వాడు ఎంతో ఖుషీ అయ్యాడని మురిసిపోయింది. ఇక థియేటర్లలో తన కొడుకు చూడబోయే మొదటి సినిమా ఇదేనని కాజల్ ఎమోషనల్ అయ్యింది.మగధీర, డార్లింగ్, లాంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలతో సౌత్ ఇండస్ట్రీని ఏలిన కాజల్.. పెళ్లయ్యాక కూడా తన క్రేజ్ తగ్గలేదని నిరూపిస్తోంది. కేవలం కమర్షియల్ హంగుల కోసమే కాకుండా, తన కొడుకు గర్వపడేలా కంటెంట్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటానని స్పష్టం చేసింది

## వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'

### రిలీజ్ డేట్ వచ్చేసింది!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా, దర్శకుడు మేర్లపాక గాంధీ రూపొందిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని 2026 ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు వరుణ్ తేజ్ తన ఎక్స్ ఖాతాలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ, "2026.. ఆగస్ట్ 7... ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ" అని పేర్కొన్నారు.భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా... భారత్, కొరియా నేపథ్యంలో సాగే కథతో విభిన్నమైన హారర్ కామెడీగా ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ మునుపెన్నడూ చూడని వినూత్నమైన పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే మార్చి నెలలో కొరియాలో వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్యలపై కీలక సన్నివేశాలు, పాటలను చిత్రీకరించి చివరి షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఏప్రిల్‌లో విడుదలైన 'కమ్సహమ్నిదా' పాటకు మంచి స్పందన లభించింది.వరుణ్ తేజ్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. గ్లింప్స్ ప్రకారం.. కనకరాజు అనే వ్యక్తి కోసం కొరియన్ పోలీసులు ఓ ఇండియన్ ఫొటోగ్రాఫర్‌ను చిత్రహింసలకు గురిచేస్తారు. ఇంతలో, ఓ పౌర్ణమి రాత్రి తన దేహంపై ఆత్మ ఆవహించిన కనకరాజు (వరుణ్ తేజ్) పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి, సమురాయ్ కత్తితో పోలీసులను అంతం చేస్తాడు. ఈ ఘటన చూసిన ఫొటోగ్రాఫర్, "ఈ కనకరాజు మన కనకరాజు కాదు" అనడంతో కథపై ఉత్కంఠ పెరిగింది.ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, మనోజ్ రెడ్డి కాటసాని సినిమాటోగ్రఫీ, సత్య జి ఎడిటింగ్ బాధ్యతలు

## రోషన్ కనకాల కొత్త మూవీ ప్రారంభం




టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల కథానాయకుడిగా ఓ వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె. కమిశెట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదం వంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఒక సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ కథను సిద్ధం చేశారు.ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక అత్యంత వైభవంగా జరిగిన ఈ ముహూర్తపు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. యువ హీరో నిఖిల్ సిద్దార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, టాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు, త్వరలోనే టైటిల్ మరియు పూర్తి నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. అన్ని హంగులు అద్దుకుని త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది.

## శ్రీ శ్రీ.. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే కొత్త చిత్రానికి టైటిల్ ఫిక్స్




యూత్ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉన్న హీరో దుల్కర్ సల్మాన్, స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే జంటగా నటిస్తున్న కొత్త సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇప్పటివరకు ణు41గా పిలుస్తున్న ఈ చిత్రానికి "శ్రీ శ్రీ" అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాలేజీ నేపథ్యంలో రూపొందించిన ఈ ఫస్ట్ లుక్‌లో దుల్కర్, పూజా హెగ్డే ఎంతో తాజాగా, రొమాంటిక్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. "ప్రేమ మళ్లీ చిగురిస్తుంది" (ాశీజవ ఔఅశ్రీశ్రీ ాజూఖతీఎ-ూాస్త్రుఱఅఅ) అనే ట్యాగ్‌లైన్‌ను పోస్టర్‌పై జోడించడంతో, ఇది ఒక ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది.రవి నేలకూడిటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సుధాకర్ చెరుకూరి తన ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై 10వ చిత్రంగా దీన్ని నిర్మిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జతకడుతున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి, జగపతి బాబు, రమ్యకృష్ణ వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గతంలో ఈ సినిమా షూటింగ్ స్టిల్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించగా, ఇప్పుడు విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ అంచనాలను మరింత పెంచాయి.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com